File Copy
Dept. of Information and Public Relations, Hyd. A. P.

ANDHRA JYOTI, Vijayawada. Regd. No. 375. Telephone : 1343.

చందారేట్లు

	ఏజంటు ద్వారా రు. పై.	పోస్టులో రు. పై.
సంవత్సరానికి	28.00	31.00
ఆరు మాసాలకు	14.00	15.50
మూడు మాసాలకు	7.00	7.90
ఒక మాసానికి	2.40	2.65

పత్రికా సంబంధమైన వేతరాలకు :
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2

ఆంధ్రజ్యోతి

ఎడిటర్ : నార్ల వెంకటేశ్వరరావు

120047

ప్రాసెస్ బ్లాకులు
అఫ్‌టోన్ లైన్ బ్లాకులు సకాలంలో చేసిఇవ్వగలము
వివరాలకు వ్రాయండి : ఆంధ్రజ్యోతి పో. బా. నెం. 334, విజయవాడ-2

సంపుటి 2 :: సంచిక 257 | విజయవాడ, మార్చి 22, 1962 గురువారం | 6 పేజీలు :: 7 నయాపైసలు

ఇండియా సందర్శనకు నేపాల్ రాజు మహేంద్ర అంగీకారం

ఆయన ఏప్రిల్ మొదటి వారంలో లేదా ఆఖరి వారంలో న్యూఢిల్లీ రావడం సాధ్యమౌతుందని

తెలియజేసినట్టు శ్రీ నెహ్రూ వెల్లడి

భారత-చైనా సరిహద్దు వివాదంలో మధ్యవర్తి పరిష్కారానికి అవకాశం లేదని స్పష్టీకరణ

కేంద్ర మంత్రివర్గంలో వివిధ రాష్ట్రాలకు తగు ప్రాతినిధ్యం వుండగలదని, సభ్యులు తగు సంఖ్యలో వుంటారని ప్రధాని సూచన

శ్రీమతి కెనెడీ పర్యటన ఇండియా, అమెరికాల మధ్య మరింతగా అవగాహన చేసికొనడానికి తోడ్పడినట్టు ప్రకటన

న్యూఢిల్లీ, మార్చి 21—

ఇండియా పర్యటించడానికి నేపాల్ రాజు మహేంద్ర అంగీకరించారని, ఆయన ఏప్రిల్ మొదటి వారంలో కాని, ఆఖరి వారంలో కానీ వస్తామని సూచించారని ప్రధాని నెహ్రూ నేడిక్కడ పత్రికా గోష్ఠిలో వెల్లడించారు.

ఇండియా, చైనా సరిహద్దు వివాదంపై మధ్యవర్తిత్వ మార్గాలను అవలంబించవలెనన్న శ్రీ జయప్రకాశ్ నారాయణ్ సూచనను గురించి ప్రస్తావిస్తూ, సిద్ధాంత రీత్యా దానిని త్రోసివేయమని, అయితే ఆచరణలోమాత్రం దానికి అవకాశం కనిపించడం లేదని శ్రీ నెహ్రూ చెప్పారు.

శ్రీమతి కెనెడీ ఇండియా పర్యటన దిగ్విజయమైనదని, ఆ పర్యటన ఉభయదేశాల మధ్య పరస్పర అవగాహన పెంపొందడానికి తోడ్పడిందని ఆయన అన్నారు.

17 రాజ్యాల నిరాయుధీకరణ సభలో ఇప్పటివరకు చెప్పుకొనదగినంత అభివృద్ధి కనబడ లేదని, అయితే సమావేశాన్ని విజయవంతం చేయవలెనన్న ఆతురత వివిధ దేశాల ప్రతినిధులలో వున్నదని ఆయన ఉద్ఘాటించారు.

మధ్యవర్తిత్వంపై తాను చెప్పిన సమాధానం కేవలం ఇండియా-చైనా వివాదానికే గాక, కాశ్మీర్, తదితర సమస్యలకుకూడా వర్తిస్తుందని శ్రీ నెహ్రూ చెప్పారు.

ఏ వివాదంలోనైనా మధ్యవర్తిత్వానికి సిద్ధాంతరీత్యా తాను సుముఖుడనేనని, అయితే ప్రత్యేకమైన సమస్యల విషయంలో మాత్రం తన అభిప్రాయం భిన్నమైనదని ఆయన స్పష్టపరిచారు.

ఇండియా - చైనా సరిహద్దు వివాదంలో ఉభయ దేశాలమధ్య సంప్రదింపులు ఉభయ దేశాల ఉద్యోగుల నివేదిక ప్రాతిపదికపై మాత్రమే జరగాలని ఆయన ఉద్ఘాటించారు. ఆ నివేదిక వివరాలను చైనా ప్రచురించ లేదని కూడా ఆయన ఆ సందర్భంలో చెప్పారు.

దేశంలో ఇటీవల జరిగిన జనరల్ ఎన్నికలను గురించి మాట్లాడుతూ కాంగ్రెసు ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను, కార్యక్రమం పట్ల ప్రజలు తమ విశ్వాసాన్ని వ్యక్తపరిచారని, ఇకముందు కూడా ప్రభుత్వం ఆ విధానాలనే అనుసరిస్తుందని ప్రధాని ఉద్ఘాటించారు.

స్వతంత్రపార్టీ వంటి మితవాద పక్షాలు కొన్ని ప్రాంతాలలో విజయం సాధించినందు వల్ల ప్రభుత్వం విధానాలలో మార్పులు జరగవని శ్రీ నెహ్రూ స్పష్టంపరిచారు.

స్వతంత్రపార్టీ గెలవడానికి కారణం ప్రజలు దాని విధానాలకు ఆమోదించినందు వల్ల కాదని వ్యక్తిగత పలుకుబడివల్ల మాత్రమే గెలిచిందని ఆయన అన్నారు.

రాష్ట్రాలలో ఎక్కువమంది సభ్యులతో మంత్రివర్గాలను నియమించడాన్ని ఆయన నిరసించారు.

పార్టీలోని ప్రధానమైన వర్గాలకు ప్రాతినిధ్యమిచ్చి విశాల ప్రాతిపదికపై మంత్రివర్గాలను ఏర్పాటు చేయవలెనని అధిష్ఠాన వర్గం సూచించిందని, అయితే దాని అర్థం పెద్ద మంత్రివర్గాలను ఏర్పాటు చేయమని కోరడం కాదని వివరించారు.

నూతన కేంద్ర మంత్రివర్గం సభ్యులను గురించి స్వరూపాన్ని గురించి ఆయన చెప్పలేదు. అయితే కేంద్ర మంత్రివర్గంలో రాష్ట్రాలకంటె ఎక్కువమంది మంత్రులు వుండవలసిన అవసరం వుందని ఆయన అన్నారు.

సాంఘిక వ్యవస్థలో కులం ఒక శక్తిగా తన బలాన్ని కోల్పోతుండగా అది తిరిగి రాజకీయ రంగంలో ప్రవేశించినట్టు ఇటీవల జరిగిన ఎన్నికలు నిరూపించినవని ఆయన అన్నారు.

జాతీయ సమైక్య సాధన సంఘం కార్యకలాపాలు ఎన్నికలవల్ల స్థంభించిపోయిన వని, అది ఇప్పుడు తిరిగి తన పనిని కొనసాగింప గలదని శ్రీ నెహ్రూ చెప్పారు.

నేపాల్ రాజు పర్యటన

నేపాల్ రాజు పర్యటన గురించి మీకు ఏదైనా వర్తమానం వచ్చిందా ? అని ప్రశ్నించగా ప్రధాని ఈ విధంగా సమాధానమిచ్చారు :

"ఆయన వద్ద నుంచి నాకు ప్రత్యేకంగా ఎటువంటి వర్తమానం రాలేదు. అయితే ఆ జవాబు నేపాల్ లోని మన రాయబారి ద్వారా వచ్చింది. ఇండియాలో పర్యటనకు తనకు అనుగుణంగా వుండే తేదీలను రాజు సూచించారు. అది ఏప్రిల్ మొదటి వారంలో కాని ఆఖరి వారంలోకాని రాగలనని ఆయన సూచించారు. ఆ ప్రాంతంలో మనం ఒక తేదీని నిర్ణయించాలి."

శ్రీమతి కెనెడీ ఇండియా పర్యటన

శ్రీమతి జాక్విలిన్ కెనెడీ ఇండియా పర్యటన దిగ్విజయమైనదని ప్రధాని నెహ్రూ వర్ణించారు.

శ్రీమతి కెనెడీ పర్యటన గురించి ఆయన ఇంకా ఇలా అన్నారు:

"జన బాహుళ్యం దృష్ట్యా చూస్తే శ్రీమతి కెనెడీ పర్యటన విజయవంతమైనది. ఆమె పర్యటన ఇండియా-అమెరికాల సంబంధాల అభివృద్ధికి తోడ్పడుతుం"దని ఆయన అన్నారు.

శ్రీమతి కెనెడీ పర్యటనవల్ల ఏర్పడిన అవగాహనవల్ల గోవా, అణ్వస్త్ర పరీక్షల వంటి సమస్యలపై ఏర్పడిన విభేదాలు సమసిపోవడానికి అవకాశాలు వున్నాయా అని ప్రశ్నించగా, పరస్పర అవగాహన వుంటే దీర్ఘకాలంలో ఆ అభిప్రాయ భేదాలు సమసిపోతాయని ఆయన జవాబు చెప్పారు.

ఆయన ఇంకా ఇలా అన్నారు :

"ఆమె కొద్దికాలం మాత్రమే ఇండియాలో పర్యటించి నప్పటికీ ఆ పర్యటన భారతీయులను ముగ్ధులను చేసింది. ఆమె ఇండియా నుంచి మధురస్మృతులను తీసుకొనివెడతారని, దేశంలో ఇతర ప్రాంతాలను సందర్శించడానికి మరొకసారి ఇండియా వస్తారని నేను ఆశిస్తున్నాను."

ఇండియా - చైనా సరిహద్దు వివాదం

ఇండియా - చైనా సరిహద్దు వివాదం వంటి సమస్యల విషయంలో సిద్ధాంతరీత్యా మధ్యవర్తిత్వాన్ని త్రోసివేయలేమని అయితే ఆచరణలో అది అనేక కారణాలపై ఆధారపడి వుంటుందని ప్రధాని చెప్పారు.

తనకు, చైనా ప్రధానికి మధ్య సమావేశాన్ని ఏర్పాటుచేయడాన్ని గురించి సూచనలు కాని, సంభాషణలు కాని లేవని ప్రధాని నెహ్రూ తెలియజేశారు.

ఈ వివాదం శాంతియుత సంప్రదింపుల

[మిగతా 2 వ పేజీలో]

వాస్తవానికి అనుగుణంకాని అభివర్ణనలు

"స్వేచ్ఛా ప్రపంచం" పదంపై నెహ్రూ వ్యాఖ్య

న్యూఢిల్లీ, మార్చి 21— కొన్ని దేశాలను "స్వేచ్ఛా ప్రపంచం"గా అభివర్ణించడం హాస్యాస్పదమని ప్రధాని నెహ్రూ నేడు అన్నారు.

ఈ ప్రపంచంలో ఎన్నో వర్ణనలు వుంటాయని, కాని అందులో ఒక్కటీ వాస్తవానికి అనుగుణంగా వుండదని ఆయన అన్నారు.

శ్రీమతి కెనెడీ పాకిస్తాన్ పర్యటన నిశేషాలను పంపడానికి ఇండియా నుంచి వెళ్ళగోరిన నలుగురు ప్రెస్ ఫొటోగ్రాఫర్లకు మంజూరు చేసిన వీసాలను పాకిస్తాన్ ప్రభుత్వం రద్దు చేయడంపై అడిగిన ప్రశ్నకు సమాధానంగా శ్రీ నెహ్రూ ఈ విషయం చెప్పారు.

నేడు జరిగిన ప్రధాని నెహ్రూ పత్రికా గోష్ఠిలో అడిగిన మొదటి ప్రశ్న ఇదే. ఈ గోష్ఠికి అమెరికన్ జర్నలిస్టులు కూడా వచ్చారు.

శ్రీ నెహ్రూ : నే నేమి చెప్పను? దీన్ని గురించి పాకిస్తాన్‌ను ప్రశ్నించండి ?

విలేకరి : స్వేచ్ఛా ప్రపంచంలో పాకిస్తాన్ సభ్యురాలు అంటున్నారు కదా !

శ్రీ నెహ్రూ : ఈ ప్రపంచంలో ఎన్నో వర్ణనలు వున్నాయి కాని అందులో ఒక్కటీ కూడా వాస్తవానికి అనుగుణం కాదు. (నవ్వు)

అల్జీరియా భావిప్రతిపత్తి

జులై ఆఖరున రిఫరెండం జరపడానికి నిశ్చయించినట్టు ఫ్రెంచి ప్రభుత్వ ప్రకటన

శాంతి అనంతరం అల్జీరియాలో తిరిగి అల్లరులు

అల్జీర్స్, మార్చి 20—

అల్జీరియాలో శాంతి ఏర్పడిన తర్వాత నేటి సాయంకాలం తిరిగి హత్యాకాండ జరిగింది. తుపాకులకు గురై 29 మంది మరణించారు.

యూరోపియన్‌లు అధిక సంఖ్యాకులుగా గల ఓరాన్ పెట్రోలియం సిటీకి సుమారు 25 మైళ్ళదూరంలో వున్న నెయింట్ డెసిన్ డూసీగ్‌నుంచి వచ్చిన వార్తల ప్రకారం నిన్న ముస్లిం సేనలకు, పౌరులకు మధ్య జరిగిన సంఘర్షణలలో 48 మంది మరణించినట్టు తెలుస్తున్నది. అక్కడ నిన్న ముస్లిం పౌరులు నలుగురు ముస్లిం ఫ్రెంచి సైనికులను చంపారు.

అల్జీర్స్‌లో 25 మంది చనిపోయినట్టు ధ్రువపడని వార్తలు తెలుపుతున్నవి.

అల్జీరియాపై రిఫరెండం: డిగోల్ ప్రకటన

పారిస్, మార్చి 20—ప్రెసిడెంట్ డిగోల్ నేడొక ప్రకటన చేస్తూ, తన ప్రభుత్వం అల్జీరియా విధానంపై ఆలస్యంలేకుండా రిఫరెండం తీసికొననున్నట్టు తెలియజేశారు.

ఏప్రిల్ 8 వ తేదీన రిఫరెండం జరుగుతుందని అధికార ప్రతినిధి అన్నారు.

ఫ్రెంచి జాతీయసభ అసాధారణ సమావేశంలో ప్రెసిడెంట్ సందేశాన్ని అసెంబ్లీ అధ్యక్షుడు ఎం. జాక్వెస్ చాబన్ దెల్మాస్ చదివి వినిపించారు.

యుద్ధ విరమణ ఒప్పందం వల్ల కలుగగల బహుళ ప్రయోజనాలవల్ల ఎవ్వరికి సందేహాలు తగవని దానిని అమలు పరచడంలో హక్కులను అధిగమించడంలోకూడా అనుమానాలు కూడవని దేశంపై, రిపబ్లిక్‌పై తనకు విశ్వాసం కలదని ప్రెసిడెంట్ డిగోల్ తన సందేశంలో తెలిపారు.

యుద్ధ విరమణ సాధన

యుద్ధ విరమణకు, స్వయంనిర్ణయాధికారం రిఫరెండం ప్రకటనకు మధ్య కాలంలో ప్రభుత్వ వ్యవహారాలను నిర్వహించడానికి మూడు ప్రత్యేక సంస్థలను ఏర్పాటు చేస్తూ నేడొక ఉత్తరువును జారీ చేశారు.

స్వయం నిర్ణయాధికారం రిఫరెండం

జులై ఆఖరులో అల్జీరియాలో స్వయం నిర్ణయాధికారం సమస్యపై రిఫరెండం జరపడానికి నిశ్చయించినట్టు ఫ్రెంచి ప్రభుత్వం నేడు ప్రకటించింది.

ఈ రిఫరెండం ప్రకారం అల్జీరియా భావి ప్రతిపత్తిపై వోటు చేయడానికి ప్రతి అల్జీరియన్‌కు హక్కు వుంటుందని తెలియజేశారు.

అల్జీరియన్ విప్లవకారులతో చేసికొన్న ఒప్పందాన్ని ఆమోదించడానికి ఏప్రిల్ 8 వ తేదీన రిఫరెండం జరుగుతుందని ప్రభుత్వం అంతకుముందు ప్రకటించింది.

అల్జీరియా విప్లవ ప్రభుత్వాన్ని సోవియెట్ యూనియన్ చట్టరీత్యా గుర్తించడం తీవ్రమైన దౌత్య సంఘటనగా ఫ్రెంచి ప్రభుత్వం భావిస్తున్నదని, విదేశాంగ శాఖ ప్రతినిధి ఒకరు నేడు చెప్పారు.

నేడు రుమేనియా, జెకోస్లోవాకియాలు కూడా అల్జీరియా విప్లవ ప్రభుత్వాన్ని గుర్తించాయి.

చౌ ఎన్-లై అభినందనలు

హాంగ్‌కాంగ్, మార్చి 20— అల్జీరియా ఫ్రేంచి యుద్ధ విరమణ ఒప్పందం సాధించినందుకు అల్జీరియా విప్లవ ప్రభుత్వం ప్రధాని శ్రీ బెన్ మూసప్ బెన్ ఖెద్దాకు చైనా ప్రధాని శ్రీ చౌ ఎన్ లై నేడు తన అభినందనలు తెలియజేసినట్టు న్యూ చైనా వార్తా సంస్థ ప్రకటించింది.

పదవీకాలం ముగిసిన పార్లమెంట్ సభ్యులు

గౌరవార్థం, ప్రధాని నెహ్రూ భవనంలో విందు

న్యూఢిల్లీ, మార్చి 21—పార్లమెంటులో పదవీ కాలం ముగిసిన సభ్యులకు ప్రధాని శ్రీ నెహ్రూ నివాసభవనంలో నిన్న సాయంత్రం విందు ఏర్పాటు చేయబడింది.

ఈ విందును కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ ఏర్పాటు చేసింది.

ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్, శ్రీ నెహ్రూ, సభాపతి శ్రీ అనంతశయనం అయ్యంగార్, కేంద్ర మంత్రులు విందుకు హాజరైనారు.

హోలీ పండుగ కూడా నిన్ననే కలసి వచ్చిన కారణంగా విందు ఉత్సాహపూరితంగా జరిగింది.

ప్రధాని నెహ్రూ విందుకు విచ్చేసిన వారిపై రంగు జల్లుతూ డాక్టర్ రాధాకృష్ణన్ విందు జరిగే ప్రదేశానికి రాగానే ఆయన నుదుటిపై రంగు చల్లారు.

విందు సందర్భంలో శ్రీ నెహ్రూ పదవీ కాలం ముగిసిన పార్లమెంటు సభ్యుల నుద్దేశించి మాట్లాడుతూ, గతంలో చేసిన విధంగానే ఇక ముందుకూడా వారు ప్రజాసేవ చేయాలని తాను కోరుతున్నా నన్నారు.

అనంతరం హోలీ పండుగను అభివర్ణించే పాటలు, నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేయబడినవి.

ప్రధాని నెహ్రూ హోలీ పండుగ అభినందనలు

న్యూఢిల్లీ, మార్చి 21—ప్రధాని నెహ్రూ నేడు పెక్కుమంది విలేకరులు హాజరైన తన పత్రికా గోష్ఠిని "అట్ కో హోలీ ముబారక్ హో" అని హోలీ పండుగ అభినందనలు తెల్పుతూ ప్రారంభించారు.

శ్రీ నెహ్రూ కోటు ఎప్పుడూ తెల్లగా వుండేది. కాని ఈ రోజున ఆయన కోటు మీద ఎక్కడ చూచినా ఎర్ర రంగే. నేడు హోలీ పండుగ కావడం చేత ఆయన పత్రికా గోష్ఠికి వస్తూ వుండగా మధ్యలో హోలీ వినోదకులు ఎర్ర రంగు పొడిని చల్లారు.

పత్రికా గోష్ఠికి వచ్చిన పెక్కుమంది విలేకరుల ముఖాలపైన, దుస్తుల పైన కూడా హోలీ రంగులు కనిపించాయి.

శ్రీ నెహ్రూ పత్రికా గోష్ఠికి ఉపక్రమిస్తూ ఇలా అన్నారు :

"నేడు పత్రికా గోష్ఠికి చాల అననుకూలమైన రోజు.

"ఈ రోజున పత్రికా సమావేశాన్ని జరుపుతున్నందుకు మీలో కొందరికి నేను క్షమాపణ తెలుపుతుంటున్నాను. నేను పత్రికా గోష్ఠిని ఈ రోజున జరపాలని అనుకున్నప్పుడు హోలీ పండుగ కూడా ఇదే రోజున వస్తుందని నేను అనుకోలేదు. కాని తర్వాత మార్చుకోవడానికి కూడ వీలు లేకపోయింది. శ్రీమతి కెనెడీ పర్యటన సందర్భంలో ఇండియాకు వచ్చిన అమెరికా విలేకరులు ఈ ఉదయమే ఇక్కడికి వచ్చారు. వారు సాయంత్రం వెళ్ళిపోతున్నారు. మీరు నన్ను మన్నిస్తారని ఆశిస్తాను."

కృష్ణాజిల్లా రాజకీయ ప్రత్యేక వ్యవహారాలు

పరిషత్తు అధ్యక్ష పదవి మున్నగు సమస్యలపై నిర్ణయంచేయడానికి శ్రీ సంజీవరెడ్డికి అధికారం

హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో తీర్మానం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, మార్చి 21—

కృష్ణాజిల్లాలోని రాజకీయ పరిస్థితుల గురించి, జిల్లాపరిషత్తు అధ్యక్షుడు వగైరా కొన్నిపదవులకు అభ్యర్థుల నిర్ణయం సమస్య గురించి శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు, ఇతర ప్రముఖులు నిన్న అరోగ్యమంత్రి శ్రీ శివరామప్రసాద్‌గారి గృహంలో సమావేశమై చర్చించారు.

జిల్లా కాంగ్రెసు అధ్యక్ష పదవి జిల్లా పరిషత్తు అధ్యక్ష పదవి, విజయవాడ దక్షిణం ఉప ఎన్నిక, ఉపాధ్యాయుల నియోజకవర్గం నుంచి శాసన పరిషత్తుకు అభ్యర్థి నిర్ణయం మున్నగు సమస్యలను ఈ సమావేశంలో పరిశీలించారు.

ఈ సమస్యలపై నిర్ణయంతీసికొనే అధికారాని పార్టీ నాయకుడు శ్రీ సంజీవరెడ్డికి విడిచిపెడుతూ ఈ సమావేశంలో తీర్మానించారు.

ఈ పైన పేర్కొన్న అన్ని విషయాలలో ఆయన నిర్ణయాన్ని అనుసరించాలని, ఈ పదవులకు ఎవ్వరైతే పోటీ చేయదలచినారో వారు నేరుగా శ్రీ సంజీవరెడ్డిగారికి విజ్ఞప్తి చేసుకోవాలని కూడా ఈ సమావేశంలో నిర్ణయం చేశారు.

ఈ సమావేశాన్ని ఎక్సయిజ్ మంత్రి శ్రీ ఎం. ఆర్. అప్పారావుగారు ఏర్పాటు చేశారు.

భారతీయ వాణిజ్య మండలి వార్షికోత్సవం

ఈనెల 24 న ప్రధాని నెహ్రూచే ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, మార్చి 21—భారతీయ వాణిజ్య పరిశ్రమల మండలి 35 వ వార్షిక మహాసభ వచ్చే 24 వ తేదీన ఇక్కడ విజ్ఞాన భవన్‌లో జరుగుతుంది.

ఈ మహాసభకు ప్రధాని నెహ్రూ ప్రారంభోత్సవం చేస్తారు.

శ్రీ మురార్జీ దేశాయి 66 వ జన్మదినోత్సవం

మహారాష్ట్ర ముఖ్యమంత్రి ప్రభృతుల శుభాకాంక్షలు

బొంబాయి, మార్చి 21— కేంద్ర ఆర్థిక మంత్రికి 66 వ సంవత్సరం నేడే ప్రవేశించినదని తెలియవచ్చింది.

శ్రీ మురార్జీ తన జన్మ దినోత్సవాన్ని సదుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో గడిపే నిమిత్తం, నిన్న రాత్రి ఢిల్లీనుంచి ఇక్కడికి వచ్చారు.

మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ వై. బి. చవాన్, మరికొంత మంది మంత్రివర్గ సభ్యులు, ప్రముఖ పారిశ్రామిక వేత్తలు, వ్యాపారులు, మిత్రులు, బంధువులు శ్రీ మురార్జీని సందర్శించి తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

అర్జెంటీనా సంక్షోభం

మంత్రులందరు రాజీనామా చేసినట్టు, మిశ్రమ ప్రభుత్వ స్థాపనకు యత్నిస్తున్నట్టు వార్తలు

బ్యూనోస్ ఎయిరెస్, మార్చి 21—

అర్జెంటీనా మంత్రులందరు రాజీనామా చేశారని, మిశ్రమ ప్రభుత్వ స్థాపనకు ప్రెసిడెంట్ ఆర్టురో ఫ్రాండిజి వెంటనే చర్చలు ప్రారంభించ నున్నారని నేడు అధికార ప్రకటన చేశారు.

మొన్న ఆదివారం నాడు జరిగిన ఎన్నికలలో మాజీ నియంత జువాన్ పెరాన్ అనుచరులు మొత్తం 16 రాష్ట్రాలలోను పదింటిలో అత్యధిక సంఖ్యతో గెలుపొందారు. వారు అఖండ విజయాన్ని పొందిన రాష్ట్రాలలో బ్యూనోస్ ఎయిరెస్ కూడా ఒకటి.

ఈ ఎన్నికల పరిణామాలు కారణంగా ప్రతిష్టంభన ఏర్పడింది. అది మంత్రుల రాజీనామాలకు దారి తీసింది.

మాజీ నియంత జువాన్ పెరాన్ అనుచరులకు ఏడు గవర్నర్ పదవులు లభించాయి. ఫెడరల్ డిప్యూటీల సభలో 45 స్థానాలు వచ్చాయి.

నిన్న రాత్రి సైన్యం నుంచి వచ్చిన తీవ్రమైన వత్తిడివల్ల ప్రెసిడెంట్ ఫ్రాండిజి రాజీనామా చేస్తాడన్న వదంతులు వ్యాపించాయి. అధికారులు వాటిని ఖండించినప్పటికీ అవి వ్యాపిస్తూనే వున్నాయి.

తక్షణమే జోక్యం చేసికొని, పెరానిస్టుల ఎన్నికను రద్దుచేయవలసిందిగా ప్రెసిడెంట్‌ను సైనిక నాయకులు కోరారు.

నిన్న రాజధానిలోని కీలక ప్రదేశాలలో సాయుధదళాలు గస్తీ తిరిగాయి.

పెరానిస్టులు గెలుచుకొన్న రాష్ట్రాలలో అయిదింటిని సైన్యం వశం చేసికున్నది. కాని హక్కులను అధికారులను పునర్నిర్మాణంచేసే అధికారంతో ప్రభుత్వం పౌరపరిపాలనాధికారులను నియమించింది.

బిరాత్‌నగర్ లో అగ్ని ప్రమాదం

కోటి రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్టు వార్త

కలకత్తా, మార్చి 21 — ఇండియా, నేపాల్ సరిహద్దువద్దగల బిరాత్‌నగర్ అనుపారిశ్రామిక పట్టణంలో ఈ నెల 19వ తేదీన అగ్ని ప్రమాదం సంభవించినకారణంగా వేలాది పౌరులు తమ గృహాలను కోల్పోయినారని, సుమారు కోటిన్నర రూపాయల ఆస్తినష్టం సంభవించి ఉండవచ్చునని తెలియవచ్చింది.

పట్టణంలో ప్రధానమైన వీధులలోనికి మంటలు వ్యాపించిన కారణంగా, గుడ్డ, జనపనార సంచులు, మందులు, ఆహార పదార్థాలు అనేకం మంటలకు ఆహుతయినవని తెలుస్తున్నది.

అగ్ని ప్రమాదానికి కారణం ఇంతవరకు తెలియలేదు.

పాకిస్తానీయులచే భారతీయుని అపహరణ

తీవ్ర నిరసన తెలిపినట్టు పశ్చిమ బెంగాల్ మంత్రి వివరణ

కలకత్తా, మార్చి 21—పశ్చిమ బెంగాల్ జాతీయ వలంటీర్ల దళానికి చెందిన ఒక సభ్యుని ఈ నెల 15 వ తేదీన భారత భూభాగం నుంచి దొంగిలించుకొని పోయినందుకు తూర్పు పాకిస్తాన్‌కు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీవ్ర నిరసన తెలియజేసిందని రాష్ట్ర హోం (పోలీస్) మంత్రి శ్రీ కె. పి. ముఖర్జీ నిన్న అసెంబ్లీలో తెలియజేశారు.



1962 మార్చి 22 గురువారం
శ్రీ ప్లవనామ సంవత్సర
ఫాల్గుణ బహుళ పాడ్యమి
పాడ్యమి : వు॥ 3-43
హస్త : రా॥ 10-24
వర్జ్యం : రే ఉ॥ 6-49

1962 మార్చి 23 శుక్రవారం
శ్రీ ప్లవనామ సంవత్సర
ఫాల్గుణ బహుళ విదియ
విదియ : సా॥ 5-47
చిత్త : రా॥ 12-55
వర్జ్యం: ఉ॥ 7-14 నుంచి 9-00 వరకు

ఆంధ్రజ్యోతి
"తమసో మా జ్యోతిర్గమయ"

కార్యవాదిత్వం

కార్యవాది కొన్నిట మృదువుగా ప్రవర్తించడం అవసరమైతే, మరి కొన్నిట కరకుగా ప్రవర్తించడం అత్యవసరం.

పట్టు విడుపు లెరిగి పనికి దొరకొనవలసిందే కాని, జీవన్మరణ సమస్యలలో ఏమాత్రం పట్టు వదలినా మొదటికే మోసం వాటిల్లగలదు.

కృష్ణా గోదావరీ నదీజలాల పంపకం విషయం తెలుగు నేలకు సంబంధించినంతవరకు బ్రదుకుచావుల సమస్య.

ఒకరిది అపహరించవలెననుకొనడం ఎంత చెడుగో, తనది వదలుకొని తనవారినోట దుమ్ము పడజేయడం కూడా అంత చెడుగే.

అందువల్లనే ఆంధ్రప్రదేశ్ శాసన సభలోని అన్ని పక్షాలు, తెలుగునాడులోని అన్నివర్గాలు ఈ విషయంలో ముక్తకంఠంతో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశాయి.

అనేక పరిశీలనల తర్వాత, అనేక నిపుణుల పరిశోధనల తర్వాత, అందుకు చెందిన సర్వ విషయ సమీచీన పర్యవేక్షణల తర్వాత 1951 నాటి నదీజలాల ఒడంబడిక జరిగింది.

ఆ తర్వాత జరిగిన మార్పుల్లా కొన్ని స్వల్ప ప్రాంతాలు భాషాధారక రాష్ట్ర నిర్మాణంలో అటు నిటు రాష్ట్రాలు మారినవి. అందువల్ల అత్యవసరమైతే ఆ ఒప్పందంలో చిన్న చిన్న మార్పులను చేసుకొనడానికి అభ్యంతరం లేదన్నాం.

కాని, మహారాష్ట్ర మైసూరు ప్రభుత్వాలు మొత్తం ఆ ఒప్పందాన్నే త్రోసి రాజని కొత్తగా పంపిణీ జరగాలని కూర్చున్నందువల్ల తొలి సంయుక్త సమావేశమే భగ్నమైపోయినది.

ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ వాదంలోని బలం సకారణంగా ఎన్నో తడవలు మే మిక్కడ నిరూపించే వున్నాము.

ఏ నదీజలం కాని ఎక్కడ బాగా సాగుకు వినియోగించ వీలవుతుందో అక్కడే వినియోగించాలి; ఎక్కడ వ్యవసాయాని కెక్కువ వినియుక్తమవుతుందో అక్కడే నదీజలాల నుపయోగించాలి; మరొక రీతిగా కూడా సాధ్యమయ్యే విద్యుదుత్పాదన కని నీటిని కాటు పుచ్చకూడదు. అన్ని దేశాలలో అనుసరిస్తున్న పద్ధతి ఇది.

ఈ కారణాలన్నింటి దృష్ట్యా 1951 నాటి ఒడంబడిక మేరకు ఆంధ్రప్రదేశ్‌కు ఈ నదీజలాలలో వాటా ఏర్పడింది. అదలాగే వుంచడం అత్యవసరం.

అది కాక అంతర రాష్ట్రీయ సమాధానాల పత్రాలకు ఒక విధమైన గౌరవం, స్థిరత లేకపోతే, చేసుకున్న ఒడంబడికలను నేల వేసి కాలరాచడం మొదలిడితే ఇక వీనికి అంతు, పొంతు వుండదు.

మనం కోరుతున్నదల్లా ఆ ఒడంబడికను గాలికి వదల వద్దనే. అదైనా అకారణంగా కాక, ఆ పంపిణీ సకారణంగా నిర్ధరించినదేనని నిరూపించేందుకు మనం ఈనాటికి కూడా సంసిద్ధులమే.

అయినా ఆంధ్ర ప్రాంతంతో నిమిత్తం లేకనే, సంప్రతించకనే కేంద్రం గుల్హాతీ కమిషన్‌ను నియమించింది. తొలుత ఆ 1951 ఒడంబడికను తిరుగదోడే సమస్యే లేదని, అది తమకు చెందినది కాదని అంటున్నా, తోడనే గుల్హాతీ కమిషన్ నివేదిక వచ్చే వరకు తదనుగుణంగా నిర్ణీతాలైన ప్రాజెక్టుల విషయం ఆపవలెనన్నారు. కేంద్ర మంత్రులు అదే విధంగా సూచించారు.

ఇందుతో తెలుగునాడు గగ్గోలయినది. తెలుగువాని అభిప్రాయం శాసన సభాదులలో అభివ్యక్తమయినది.

ఇలాంటి సమస్య విషయంలో కొత్త ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ప్రారంభోత్సవం చేస్తూ గవర్నర్ విస్పష్టంగా ఆంధ్ర వాదాన్ని వివరించునని ఆశించడంలో అత్యాశలేదు. ఈ ఒడంబడికను మార్చరాదని, ఈ నీటి పంపిణీ తెలుగు నేల కవసరమని, ఇందుకు విరుద్ధమైన ఏ వితండ వాదానికి గాని మనం అంగీకరించబోమని స్పష్టం చేయవలెననుకోవడం విడ్డూరం కాదు.

ఉపన్యాసం ఈ విషయాన్ని ప్రస్తావించినా సంతృప్తిగా ఈ సమస్య పరిష్కారం కావలెనని మాత్రం స్పృశించి వదలినట్టు మాత్రమే వున్నది.

ఏమైనా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ విషయంలో కరకుగా ప్రవర్తించక తప్పదు. తమ భావ్యభ్యుదయ విఘాతుకమైన ఏ నూతనమైన పంపిణీకి గాని, వున్న ఒడంబడికకు నీళ్ళు వదలే ఏ ప్రయత్నానికి గాని తలవూచడం అసంభవమని విస్పష్టంచేయవలసి వున్నది.

ముందే కరవుతో సతమవుతున్న గడ్డలో, పరిశ్రమ లంతంతలో వున్న రాష్ట్రంలో, వ్యవసాయ మొక్కటే ప్రధాన జీవిక అయిన నేలలో వున్నదే చాలదనుకుంటుండగా, దానికే ఎసరుపెడుతున్నప్పుడు ప్రతిఘటించక తప్పదు కదా.

అప్రమత్తతతో, దృఢ సంకల్పంతో, కార్యదీక్షతో మనకు అన్యాయం జరుగకుండా చూచి, మనరాష్ట్ర ప్రభుత్వం తన కార్యవాదిత్వాన్ని నిరూపించుకొనగలదని విశ్వసిస్తున్నాము,

ఇప్పటికే కొంత కథ మన ప్రయోజనాలకు విరుద్ధంగా నడిచింది. మరింత చెడుగు జరగక ముందే జాగ్రత్తపడాలి. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకొనడం కార్యవాది లక్షణం అవుతుందా ?

కేంద్ర పారిశ్రామిక సలహా మండలి సమావేశం

న్యూఢిల్లీ, మార్చి 20— కేంద్ర పారిశ్రామిక సలహా మండలి సమావేశం మార్చి 27 వ తేదీన ఇక్కడ జరుగుతుంది. వాణిజ్య పారిశ్రామిక శాఖామంత్రి శ్రీ కె. సి. రెడ్డి ఈ సమావేశానికి అధ్యక్షత వహిస్తారు.

ఈ సమావేశంలో పెక్కు ఇతర విషయాలతోపాటు దేశ ఆర్థిక పరిస్థితి గురించి పారిశ్రామికాభివృద్ధి గురించి, టొగ్గు, విద్యుచ్ఛక్తి, రవాణా సౌకర్యాల కొరత గురించి చర్చలు జరుగుతాయి.

శ్రీకాకుళం జిల్లాలో ప్రాజెక్టుల నిర్మాణం

శ్రీ సుబ్బారెడ్డికి మెమొరాండం

హైదరాబాద్, మార్చి 21—శ్రీకాకుళం జిల్లాకు చెందిన శాసనసభ్యులు శ్రీ పి. గున్నయ్య, రాష్ట్ర నీటి పారుదల, విద్యుచ్ఛక్తిశాఖ మంత్రి శ్రీ ఎ. సి. సుబ్బారెడ్డికి ఈ నెల 19 వ తేదీన ఇక్కడ ఒక మెమొరాండం సమర్పించారు.

శ్రీకాకుళం జిల్లాలో నిర్మించ తలపెట్టిన పన్నెండు ప్రాజెక్టుల నిర్మాణాన్ని త్వరితం చేయాలని ఆ మెమొరాండంలో కోరారు. ఈ ప్రాజక్టుల నిర్మాణాన్ని పూర్తి చేసిన ఎడల మొత్తం 300 ఎకరాల మాగాణీ, 3000 ఎకరాల మెట్ట భూములు సాగులోనికి రాగలవని ఆ మెమొరాండంలో తెలియజేశారు.

వీటి నిర్మాణ వ్యయం మొత్తం నాలుగు లక్షల రూపాయలు కాగలదని ఆ మెమొరాండంలో వెల్లడించారు.

హీరా మండలి నుంచి బత్తిలి వరకు విద్యుచ్ఛక్తి సరఫరా సౌకర్యాన్ని కలుగజేయవలసిందిగా కోరుతూ, శ్రీ గున్నయ మరి ఏడుగురు కలసి శ్రీ సుబ్బారెడ్డికి సమర్పించిన మరొక మెమొరాండంలో కోరారు.

శ్రీ ఎస్. రామాచార్

న్యూజిలాండ్ పర్యటించి వచ్చిన సందర్భంలో విందు

విజయవాడ, మార్చి 21— హిందుస్తాన్ ఐడియల్ ఇన్సూరెన్సు జనరల్ మేనేజరు శ్రీ ఎస్. రామాచార్ ఇటీవల రోటరీ ఇంటర్నేషనల్ ఆహ్వానం మీద న్యూజిలాండులో పర్యటించి తిరిగి వచ్చిన సందర్భంలో వారి గౌరవార్థం "ఆంధ్రజ్యోతి" మేనేజింగ్ డైరెక్టరు శ్రీ కె. ఎల్. ఎన్. ప్రసాద్ తమ గృహంలో నేటి మధ్యాహ్నం విందు చేశారు.

విందుకు హాజరైన వారిలో శ్రీయుతులు కె. ఎస్. దత్తు, దంటు భాస్కరరావు (ఎమ్. ఎల్. ఎ.) బచ్చు వెంకటేశ్వర్లు, ఎస్. వేణుగోపాల్, మద్ది సుదర్శనంగార్లు, ఆంధ్రబ్యాంకి జనరల్ మేనేజర్ శ్రీ భగత్, శ్రీయుతులు జి. రామానుజరావు నాయుడు, (బ్రహ్మయ్య అండ్ కో) జి. కామరాజు, (పూర్ణాపిక్చర్సు), గారపాటి వెంకటేశ్వరరావు, షాన్‌బాగ్, పచ్చిపులుసు వెంకటసుబ్బారావు, ఎ. వెంకటరామయ్య ప్రభృతులు వున్నారు.

విందు అనంతరం ఇష్టాగోష్ఠిలో శ్రీ ఎస్. రామాచార్ న్యూజిలాండ్‌లో తమ పర్యటనానుభవాలను వివరించారు. న్యూజిలాండ్‌లో జీవన ప్రమాణం అత్యున్నత స్థాయిలో వున్నదట. ఆసియా దేశాలలో వాణిజ్య సంబంధాలను పెంపొందించుకోవాలని న్యూజిలాండ్ అభిలషిస్తున్నదని, ఈ అవకాశాన్ని భారతీయ వ్యాపారస్థులు వినియోగించుకోవాలని ఆయన చెప్పారు.

"సైనికావసరాలకు రోదసీ వినియోగం నిషేధం ఒప్పందం తక్షణావశ్యకం"

పరిశోధన కార్యక్రమాలలో ఆసియా, ఆఫ్రికా రాజ్యాలను పాల్గొన నివ్వాలని కూడా భారత ప్రతినిధి శ్రీ ఝా ఉద్ఘాటన

ఐక్యరాజ్యసమితి, మార్చి 21—

ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రోదసిని సైనికావసరాలకు ఉపయోగించడాన్ని నిషేధించే ప్రకటనపై తక్షణమే సంతకాలు చేయాలని ఇండియా నిన్న విజ్ఞప్తి చేసింది.

శాంతియుత ప్రయోజనాలకు రోదసీ వినియోగ అవకాశాల పరిశీలన నిమిత్తం ఏర్పాటు చేసిన సమితి ప్రత్యేక సంఘం సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి శ్రీ సి. ఎస్. ఝా ప్రసంగిస్తూ, పై విధంగా చేసికొనే ఒప్పందం ప్రస్తుత అంతర్జాతీయ న్యాయసూత్రాలలో భాగం కావాలని కూడా సూచించారు.

శ్రీ ఝా తన ప్రసంగంలో ఇంకా ఇలా అన్నారు :—

"ఇట్టి ఒప్పందం అత్యవసరము, వాంఛనీయము, ఆచరణయోగ్యము. ఇంతకు ముందు పెక్కు అవాంతరాలను ఎదుర్కోవలసివచ్చి వుండవచ్చు. కాని ఈ రంగంలో అంతర్జాతీయ సహకారానికి ఇప్పుడు విశేషావకాశాలు కలగడం అత్యంత ముదావహం.

"శాంతియుత ప్రయోజనాలకు రోదసీ వినియోగానికై ప్రాథమిక దశలోనే అంతర్జాతీయ సహకారానికి అపారావకాశాలు కనిపిస్తున్నాయి.

"వార్తా ప్రసార ఉపగ్రహాలను అభివృద్ధి చేస్తే ప్రపంచంలో వార్తాప్రసార పద్ధతిలోనే విప్లవాత్మక మార్పు వస్తుంది. వాతావరణ ఉపగ్రహాలను నిర్మిస్తే వాతావరణాన్ని గురించి ఎంతో ముందుగానే కాక అప్పటికప్పుడు తెలుసుకోడానికి అవకాశాలు కలిగి, ప్రజల జీవనంలో, ఆర్థిక విధానంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. ముఖ్యంగా ప్రపంచ మంతట వ్యవసాయ, ఆర్థిక పద్ధతిలో అపూర్వమైన శుభపరిణామాలు కలుగుతాయి.

"ఇట్టి పరిస్థితిలో మనము కోరుకొన గలిగేది ఏమున్నదిగా రోదసీ నిర్యుద్ధ ప్రపంచం కావాలని మాత్రమే. అక్కడ యుద్ధ తంత్రాలకు ఏ మాత్రం తావు వుండరాదు.

"పెక్కు రాజ్యాల నుంచి అంతరిక్షంలోని వినూత్న ప్రపంచాలకు యాత్రలు సాగించే రోజు వచ్చినప్పుడు మనకువున్న పెక్కు పాతభావాలు తొలగి పోతాయి. మానవుడే సర్వజ్ఞుడు అన్న భావం ఒక్కటే మిగులుతుంది.

"అంతర్జాతీయ రోదసీ పరిశోధన కార్యక్రమాలలో వెనుకబడిన ఆసియా, ఆఫ్రికా దేశాలు పాల్గొనడానికి అవకాశ మివ్వాలి. ఈ ప్రతిపాదన అత్యంత ప్రధానమైనది.

"ఇటీవలనే భారత రోదసీ పరిశోధన సంఘం ఆవతరించింది. ఈ కమిటీవారు ఐక్యరాజ్య సమితి ప్రత్యేక సంఘం కృషితో సహకరించడానికి సర్వదా ప్రయత్నించ గలదు."

"జాతీయ రోదసీ పరిశోధన కార్యక్రమాలకు ప్రోత్సాహ మివ్వాలి. ఈ రంగంలో వీలైన సహాయం కావాలి. ఈ విషయానికి ఇండియా అత్యధిక ప్రాధాన్య మిస్తున్నది.

సరిహద్దు వివాదంపై ప్రధాని నెహ్రూ వివరణ

[1 వ పేజీ తరువాయి]

ద్వారా మాత్రమే పరిష్కారం కావలెనని పునరుద్ఘాటిస్తూ, అయితే ఆ సంభాషణలు ఉన్నతాధికారుల నివేదిక ప్రాతిపదికపై మాత్రమే జరగాలని ఆయన పేర్కొన్నారు.

ఆ నివేదికను చైనా ప్రచురించ లేదని, దానిని ఇంతవరకు చైనా ప్రభుత్వం పరిశీలించిన సూచనలు కూడా లేవని ఆయన అన్నారు.

ఈ వివాదం మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కారం కావలెనన్న శ్రీ జయప్రకాశ్ నారాయణ్ సూచనపై వ్యాఖ్యానిస్తూ ఆయన ఇలా అన్నారు:

"ఈ సమస్యలు మధ్యవర్తిద్వారా పరిష్కారం కావు. అయితే ఉభయ పక్షాలు అంగీకరించి, తగిన పరిస్థితులు ఏర్పడి, తగిన మధ్యవర్తి నియమించబడితే దానిని నేను పూర్తిగా త్రోసిపుచ్చను"

మధ్యవర్తిత్వాన్ని గురించి తిరిగి ప్రశ్నించగా ఆయన ఇలా అన్నారు :

"మధ్యవర్తిత్వ సమస్యను పూర్తిగా త్రోసివేయలేనని చెప్పాను. మామూలుగా అది జరగదు. అందులో సార్వభౌమాధికారం వంటి సమస్యలు ఇమిడి వున్నాయి. మధ్యవర్తిత్వం అనేక సమస్యలపై ఆధారపడి వుంది."

ఇది కాశ్మీర్ సమస్యకుకూడా వర్తిస్తుందా అని ప్రశ్నించగా సిద్ధాంతరీత్యా ఏ సమస్యకైనా వర్తిస్తుందని, అయితే అది అనేక విషయాలపై ఆధారపడి వుంటుందని చెప్పారు.

ప్రశ్న : ఇండియా- చైనా సరిహద్దు వివాదంలో మధ్యవర్తిత్వం నెరపడానికి తాము సిద్ధంగా వున్నామని మూడవ పార్టీ ఏదైనా సూచించిందా ?

జవాబు : ఈ విషయంలో ఎవరూ ఎటువంటి సూచన చేయలేదు. శ్రీ జయప్రకాశ్ నారాయణ్ సూచనపై నన్ను ప్రశ్నించారు. మధ్యవర్తి ద్వారా పరిష్కారం కావడ మనే సమస్య వుండదని నేనుచెప్పలేను. ఆ సూచన నాకు తెలిసినంతవరకు శ్రీ జయప్రకాశ్ తప్ప ఎవ్వరూ చేయలేదు.

ప్రశ్న : సార్వభౌమాధికారం విషయంలో మధ్యవర్తికి భారత ప్రభుత్వం సమర్పించబడాలదని ఇప్పటి వరకు మేము భావిస్తున్నాము. మీ ప్రసంగంలో సందు ఇస్తున్నట్టు కనిపిస్తుంది' ప్రభుత్వ విధానంలో ఏమైనా మార్పు వచ్చిందా ?

జవాబు : మీరు సిద్ధాంత రీత్యా ప్రశ్నించారు. సమస్యల పరిష్కారానికి అన్ని మార్గాలలో మధ్యవర్తిత్వం ఒకటని నేను చెప్పాను. మీరు ఒక ప్రత్యేకమైన సమస్య విషయంలో ప్రశ్నిస్తే దానికి సంబంధించిన పరిస్థితులను గురించి నేను మధ్యవర్తిత్వాన్ని గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. దానిని నేను త్రోసిపుచ్చలేనని మాత్రమే చెప్పాను.

ప్రశ్న : వచ్చే ఏప్రిల్‌లో లడఖ్‌లో పోరాటం తిరిగి ప్రారంభం కావడానికి అవకాశాలు వున్న దృష్ట్యా, ఆ సమస్యను ఈశాన్య సరిహద్దు ప్రాంతం సమస్యకు భిన్నంగా భారత ప్రభుత్వం పరిగణిస్తుందా లేక ఒకే సమస్యగా పరిగణిస్తుందా ?

జవాబు : సరిహద్దు సర్దుదాట్ల విషయంలో తరచ్చే చిన్న సమస్యలను పరిశీలించడానికి సంసిద్ధంగా వున్నానని నేను చెప్పాను కాని ఈశాన్య సరిహద్దు ప్రాంతంలోకాని లడఖ్‌లో కాని వున్న పెద్దప్రాంతాలు అన్నీ ఒకే విధమైన సమస్యలు. ఈశాన్య సరిహద్దు ప్రాంతం పూర్తిగా మన స్వాధీనంలోనే వుంది. ఒక్క చిన్న గ్రామం మాత్రమే చైనా దురాక్రమణలో వుంది. లడఖ్ వైపున చాలా ప్రాంతం చైనా దురాక్రమణలో వుంది. కాబట్టి లడఖ్ దురాక్రమణ ప్రాంతాన్ని ఖాళీ చేయించడమే మనముందువున్న ప్రధాన సమస్య. ఈశాన్య సరిహద్దు ప్రాంతం తమకు చెందినదేనని చైనావారు వాదిస్తున్నారుకాని వారు అక్కడ దురాక్రమణ జరపలేదు. అది మన జాగ్రత్తవల్లనో లేక మరేదైనా కారణంవుందో నేను చెప్పలేను.

టిబెట్ వర్తక ఒడంబడికను గురించి చైనా పంపిన తాజా లేఖను గురించి ప్రశ్నించగా, ప్రచురించబడని లేఖలను గురించి తనకు స్పష్టంగా గుర్తురావడంలేదని ప్రధాని సమాధానం మిచ్చారు. అందులో ఏమీ కొత్త విషయం లేదని, ఉంటే తనకు గుర్తు వుండేదని ప్రధాని చెప్పారు.

ఇండియా- చైనాల మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రచురించబడినాయని, తిరిగి ఏదైనా లేఖ పంపితే అదికూడా ప్రచురించబడుతుందని శ్రీ నెహ్రూ చెప్పారు.

ఇంతకు ముందు జరిగిన ఒడంబడికలక్ష్యాలు నెరవేరకుండా కొత్త ఒడంబడిక చేసుకొనడం మంచిది కాదని శ్రీ నెహ్రూ చెప్పారు.

ప్రశ్న : ఈ ఎన్నికలలో భారత ప్రజలు మీపై విశ్వాసాన్ని ప్రకటించారు. చైనా కోసం నిరీక్షించడంకంటె ఈ సమస్య పరిష్కారానికి మీరు ఒక ప్రతిపాదన చేయడం మీ బాధ్యత కాదా ?

శ్రీ నెహ్రూ : ఏమైనప్పటికీ ప్రతిపాదనలు చేయవలసిన బాధ్యత ఉభయ పక్షాలకు వుంది. చైనా, ఇండియా ఉద్యోగులు రూపొందించిన నివేదికను చైనా ప్రభుత్వం ఇప్పటివరకు పరిశీలించలేదు. దానిని ఇంతవరకు చైనా ప్రచురించలేదు. ఆ నివేదికను గురించి చైనా విదేశాంగ కార్యాలయంలో కొంతమందికి తప్ప మరెవ్వరికీ తెలియదు.

ప్రశ్న : కాశ్మీర్‌లో పాకిస్తాన్ దురాక్రమణ 16 సంవత్సరాలుగా సాగుతున్నది. చైనా దురాక్రమణ ఎన్ని సంవత్సరాలు జరుగుతుంది?

శ్రీ నెహ్రూ: అది కొన్ని వందల సంవత్సరాలు జరగవచ్చు. ఈ రెండు సమస్యలకు పోలిక లేదు. దానికి కొంత కాల పరిమితి విధించడం సాధ్యం కాదు.

నిరాయుధీకరణ సభ

జెనీవాలో జరుగుతున్న 17 రాజ్యాల నిరాయుధీకరణ సభలో ఇంతవరకు ఎటువంటి అభివృద్ధి లేదని శ్రీ నెహ్రూ అన్నారు. అయితే ఈ సభ దిగ్విజయం కావలెనన్న ఆతురత ఆ సమావేశంలో పాల్గొంటున్న ప్రతినిధులలో కనబడుతున్నదని, అది శుభసూచన అని ప్రధాని అన్నారు.

ఈ మహాసభలో కొంతవరకు సత్ఫలితాలు చేకూర గలవన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తపరిచారు. మరి కొన్ని ప్రశ్నలకు సమాధాన మిస్తూ ఆయన ఇలా అన్నారు :

"వెంటనే సమగ్ర నిరాయుధీకరణ జరగడం సాధ్యంకాదు. ఒక్క రాత్రిలో అటువంటి మార్పు జరగదు, అయితే అమెరికా, రష్యాలు సంపూర్ణ నిరాయుధీకరణకు అంగీకరించాయి. నిరాయుధీకరణ దశలవారీగా జరగాలి. అయితే ఆ దశలు ఒక పక్షానికి ఉపయోగకరంగా వుండకూడదు.

"అవసరమైతే ఏప్రిల్ నెలాఖరికి నేను జెనీవా వెడతాను. అక్కడ నా వల్ల ఉపయోగం వుందని నేను భావిస్తేతప్ప వెళ్ళను."

నిరాయుధీకరణ చర్చలకు రాజ్యాధినేతల సమావేశం మరింత ప్రయోజనకరం కాదా అని ప్రశ్నించగా, రాజ్యాధినేతల సమావేశం వల్ల అక్కడ చర్చించ వలసిన సమస్యకు ప్రత్యేక ప్రాముఖ్యం వుంటుందని ప్రధాని నెహ్రూ సమాధాన మిచ్చారు. అదే దానికి లోబడుతుందని ఆయన అన్నారు.

అణ్వస్త్ర పరీక్షల నిషేధం ఒడంబడికలను ఉల్లంఘిస్తే కనుగొనడానికి ప్రస్తుతం కొన్ని దేశాలలో వున్న జాతీయ పరిశోధనా సంస్థలతోపాటు ఆసీన రాజ్యాలలో కూడా కొన్ని పరిశోధనా కేంద్రాలను ఏర్పాటు చేయవలెనని శ్రీ మీనన్ నిరాయుధీకరణ సభలో చేసిన సూచనపై వ్యాఖ్యానించవలసిందిగా కోరగా ఆయన ఇలా అన్నారు :

"నిరాయుధీకరణ ఒడంబడిక జరిగిన తర్వాత పర్యవేక్షణ, నియమ నిబంధనలు అవసరమే. అయితే ఈ విషయంలో నే చిక్కులు ఏర్పడినవి. అటువంటి పర్యవేక్షణ వల్ల తమ రహస్య స్థావరాలు కనుగొనబడతాయని రష్యా భయపడుతున్నది. నూటికి పదిలేక ఇరవై పంతుల నిరాయుధీకరణ జరిగితే నూటికి నూరు పంతుల పర్యవేక్షణ ఏర్పాటు చేయకూడదని, దానివల్ల గూఢచారి చర్యలు పెరిగి, తాము బలహీనపడతామని రష్యా చెబుతున్నది. ఇవి సైనిక జలాలకి చెందిన విషయాలేమో నాకు తెలియదు. అణ్వస్త్ర ప్రేలుళ్ళు ఎక్కడ సంభవించినా శాస్త్రీయ పద్ధతుల ద్వారా కనుగొనడం సులభమని కూడా రష్యా చెబుతున్నది. ఆసీన రాజ్యాలలో కూడా ఈ కేంద్రాలను ఏర్పాటు చేస్తే నిస్సందేహంగా ప్రపంచంలో ఏ మారుమూల జరిగినా కనుగొనవచ్చు. శ్రీ మీనన్ చేసిన సూచన ప్రయోజనకరంగానే వుంటుంది.

"మిలిటరీ దృష్ట్యాచూస్తే నిరాయుధీకరణ సమస్య క్లిష్టమైనదే కాని, దానికి మిలిటరీలో కంటె మానసిక రంగంలో ఎక్కువ ప్రాముఖ్యం వుంది. అనుమానాలను, ఆందోళనలను మనం సులభంగా అధిగమించలేము."

జెనీవాసభ జరుగుతుండగా అణ్వస్త్ర పరీక్షలను పునఃప్రారంభించవద్దని శ్రీ నెహ్రూ అమెరికాకు విజ్ఞప్తి చేసిన విషయాన్ని జ్ఞప్తికితెస్తూ, దానికి మీరు కాలపరిమితి సూచించారా అని ప్రశ్నించగా ఆయన ఈ క్రింది విధంగా సమాధాన మిచ్చారు:

"చాలామంది అభిప్రాయాలను నేను వ్యక్తపరిచాను. ఒక ఒప్పందం చేసుకొనడానికి జెనీవాలో ప్రయత్నాలు జరుగుతుండగా దాని ప్రాముఖ్యాన్ని తగ్గించే ప్రయత్నాలు కాని, దానిని తారుమారుచేసే ప్రయత్నాలు కాని జరగడం వాంఛనీయంకాదు. ఒక కాలపరిమితి సూచించవలెనని తాను భావించినప్పటికీ నేను అది సూచించలేదు."

ప్రపంచంలో ఏ ప్రాంతంలోనైనా అణ్వస్త్ర పాటవ పరీక్షలు జరగడానికి తాను వ్యతిరేకినని ఆయన పునరుద్ఘాటించారు. నిరాయుధీకరణ సభ జరుగుతుండగా ఎక్కడైనా అణ్వస్త్ర పరీక్షలు జరిగితే అవి సభా కార్యక్రమానికి విఘాతమని ఆయన అన్నారు.

ఒక ఏడాదిలోపుగా చైనా అణ్వస్త్ర పరీక్ష జరప వచ్చునని పత్రికలలో వచ్చిన వార్తలపై వ్యాఖ్యానిస్తూ దానిపై తాను ఒక అభిప్రాయాన్ని వ్యక్తపరచలేనని ఆయన అన్నారు.

చైనాలో సమర్థులైనశాస్త్రవేత్తలు, భౌతిక శాస్త్రజ్ఞులు వున్నారని వారు ఈ కృషిలో విజయం సాధించవచ్చునని ఆయన అన్నారు.

ఈ కృషిలో చైనా 18 మాసాంతానికి అయిదు లేక ఆరు సంవత్సరాలుగా సఫలీకృతం కాగలదని విభిన్నాభిప్రాయాలు వెలువడుతున్నవని ఆయన అన్నారు.

నూతన మంత్రివర్గం

కేంద్ర మంత్రివర్గం నిర్మాణం విషయంలో కార్యవిస్తృతిని, వివిధ రాష్ట్రాలకు ప్రాతినిధ్య మివ్వడాన్ని దృష్టిలో వుంచుకొనవలెనని ప్రధాని నెహ్రూ చెప్పారు. ఆయన మంత్రివర్గ స్వరూపాన్ని గురించి కాని, సభ్యుల సంఖ్యను గురించి కాని చెప్పలేదు.

రాష్ట్రాలలో ఎక్కువ మంది సభ్యులతో మంత్రివర్గాలను నిర్మించడాన్ని ఆయన నిరసించారు.

రాష్ట్రాలలో మంత్రివర్గాలు విశాల ప్రాతిపదిక పైవుండవలెనని కాంగ్రెసు అధిష్ఠాన వర్గం సూచించిందని. అయితే దానిఅర్థం రాష్ట్రంలోని తిరుగుబాటు నాయకులందరినే మంత్రివర్గంలో చేర్చుకొనవలెనని కాదని ఆయన వివరించారు.

రాష్ట్రాల మంత్రివర్గాల విషయంలో రాష్ట్ర కాంగ్రెసు నాయకులు మీ అనుమతి తీసుకొన్నమాట వాస్తవమేనా అని ప్రశ్నించగా "అది వాస్తవంకాదు" అని ఆయన సమాధాన మిచ్చారు. ఆ విషయంలో పార్లమెంటరీబోర్డు మాత్రమే కొన్ని సూచనలు చేసిందని ఆయన అన్నారు.

రాష్ట్ర కాంగ్రెసు నాయకులు తనను కలుసుకున్నారని అయితే వారు వ్యక్తులను గురించి తనతో చర్చించలేదని ప్రధాని చెప్పారు.

రాష్ట్రాలలో వలెనే కేంద్రంలో కూడా విస్తృత మంత్రి వర్గం ఏర్పడుతుందా అని ప్రశ్నించగా కేంద్రం రాష్ట్రం కంటె ఎక్కువ సమస్యలను పరిష్కరించవలసి వుంటుందని ప్రధాని చెప్పారు.

కేంద్ర మంత్రి ఏ రాష్ట్రం నుంచి, ఏ ప్రాంతం నుంచి వచ్చాడన్న విషయం ఒక సమస్య కాదన్న అభిప్రాయంలో ఆయన ఏకీభవించారు.

కేంద్ర మంత్రివర్గంలో మాజీ మంత్రి శ్రీ టి. టి. కృష్ణమాచారి వంటివారు వుంటారా అని ప్రశ్నించగానే పార్లమెంట్ సభ్యుడైన ఎవరైనా మంత్రివర్గంలో వుండవచ్చుననే విషయం అందరికీ తెలిసినదేనని ఆయన అన్నారు.

మంత్రివర్గంలో కేవలం లోకసభ సభ్యులు మాత్రమే వుంటారా? అని ప్రశ్నించగా మంత్రివర్గంలో సభ్యులుగా వుండడానికి లోకసభ, రాజ్యసభ సభ్యులకు సమానహక్కు కలదని ఆయన సమాధాన మిచ్చారు.

మీరు యువకులు, ధైర్యం, చొరవ వున్న వ్యక్తులను అభిమానిస్తారు కదా మీ మంత్రివర్గంలో యువకులకు ప్రాతినిధ్య మిస్తారా అని ప్రశ్నించగా యువకత్వం ఒక్కటే అర్హత కాదని, ధైర్యంతోపాటు మరికొన్ని గుణాలు అవసరమని ఆయన అన్నారు.

ఇండియా కొత్త ప్రెసిడెంట్ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం చేసిందా అని ప్రశ్నించగా "నాకు తెలియదు" అని ప్రధాని సమాధాన మిచ్చారు.

రోదసీ పరిశోధనలో ప్రపంచ సహకారం

సమితి కమిటీలో సోవియెట్ ప్రతినిధి సూచన

ఐక్యరాజ్య సమితి, మార్చి 21— శాంతియుత ప్రయోజనాలకు రోదసీ వినియోగానికల పరిశీలనకై సమితి ఏర్పాటు చేసిన ప్రత్యేక సంఘం సమావేశంలో సోవియెట్ ప్రతినిధి ప్లాటో మురొజోవ్ నిన్న మాట్లాడుతూ, సోవియెట్ యూనియన్ ప్రయోగించే ఉపగ్రహాల గురించి, రోదసీ వాహనాల గురించి, వాటి లక్ష్యాల గురించిన సమాచారం అందజేయడానికి తమదేశం సంసిద్ధంగా వున్నదని, అయితే, అందుకు ఇతర రాజ్యాలుకూడా అంగీకరించాలని తెలియజేశారు.

సోవియెట్ ప్రతినిధి శ్రీ మురొజోవ్ ఇంకా ఇలా అన్నారు :

"రోదసీ పరిశోధన అంటేనే విస్తృత అంతర్జాతీయ సహకారం అత్యవసరమని అర్థమౌతుంది. భూమిపైన, రోదసిలో కూడా శాంతియుత సహజీవనం అత్యంతావశ్యకం. ఈ లక్ష్యసాధనకై వీలైనంతవరకు అంతర్జాతీయ సహకారం వుండేటట్టుచూడాలి.

"రోదసీ పరిశోధనల నిర్వహించడానికి ప్రపంచంలోని సమస్త శక్తులను సమీకరించాలి.

"అంతర్జాతీయ రోదసీ పరిశోధన సంస్థ ఆధ్వర్యాన అంతర్జాతీయ శాస్త్రజ్ఞుల సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. సమితి రోదసీ సంఘం సన్నిహిత సహకారంతో ఈ కొత్త కమిటీ కృషిచేయాలి."

ప్రతి రాష్ట్రంలోను బలవర్ధక ఆహారశాఖ

ఏర్పరచాలని జాతీయ సలహా సంఘం సిఫారసు

న్యూఢిల్లీ, మార్చి 21— ప్రతి రాష్ట్రంలోను, బలవర్ధక ఆహారశాఖను, బలవర్ధక ఆహార సంఘాన్ని ఏర్పాటు చేయాలని, జాతీయ బలవర్ధక ఆహార సలహా సంఘం ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని తెలియవచ్చింది.

ఈజాతీయ సలహా సంఘం కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ డి. పి. కర్మార్కర్ అధ్యక్షతన ఇటీవల ఇక్కడ సమావేశమై పైవిధంగా సిఫారసు చేసింది.

పాఠశాలల ఆరోగ్య సంఘం సూచననుసరించి, ప్రతి పాఠశాలలోను భోజన వసతి విధానాన్ని అమలు జరుపాలని సమావేశంలో సిఫారసు చేశారు.

పెరటిలో తోటల పెంపకం, బలవర్ధక ఆహార పదార్థాలను విస్త

ఆంధ్రజ్యోతి సాహితీరంగం

ప్రచురణ: ప్రతి గురువారం

అధునిక అమెరికన్ కవి

వాలెస్ స్టీవెన్స్

అమెరికాలో వ్యాపార ప్రముఖులు కళలను పోషిస్తూ ఉండడం పరిపాటిగా చూస్తుంటాము. ముఖ్యంగా, టెలివిజన్ కార్యక్రమాలకు. ఫౌండేషన్లకు తదితర విద్యా వినోద కార్యక్రమాలకు తోడ్పడడం ద్వారా ఈ కళారాధన జరుగుతుంటుంది అయితే ఆ ప్రముఖులలోనే ఎవరైనా కళాకారుడు కావడం, దానిలో ప్రపంచ ప్రఖ్యాతి పొందడం బహు అరుదుగా జరిగే సంగతి.

కీర్తిశేషుడు వాలెస్ స్టీవెన్సు అటువంటి వారిలో ఒకరు. ఆయన ఒక ఇన్సూరెన్సు కంపెనీకి ఉపాధ్యక్షుడు. 20 వ శతాబ్ది రెండవ పాదంలో, కనుగు విలక్షణులైన అమెరికన్ కవులలో ఈయన ఒకరు. ఈయన పూర్వీకులు ఫ్రెంచి జాతీయులు. వాలెస్ స్టీవెన్స్ 1879 లో జన్మించాడు. అప్పటికి సరిగా 200

శ్రీ

జాన్ డాంగో

(యునిటీ కాలేజి ఇంగ్లీషు ప్రొఫెసర్)

సంవత్సరాలకు పూర్వం ఆయన వంశీయులు మత స్వేచ్ఛ కోసం వలస వచ్చారు. స్టీవెన్సు హార్వర్డులో చదువుకొనే రోజుల లోనే కవిత్వం వ్రాసేవాడు. అయితే లాయర్ వృత్తికి వెళ్ళాలన్న పట్టుదలతో చదువులు సాగించాడు. ఆనంతరం న్యూయార్కులో లా ప్రాక్టీసు పెట్టాడు. ఆ సందడిలో అది వరకు ఉన్న కవిత్వ పరిచయం పోవలసిన మాటే, కాని అదృష్టవశాత్తు మళ్ళీ ఆ నగరంలో తన విద్యార్థి మిత్రుల సాహచర్యం లభించింది. వారు న్యూయార్కులో చిత్రకారులు గానో, రచయితలు గానో, ఉంటున్నారు. వారి సహవాసలబ్ధివల్ల వాలెస్ కవితాభిరుచి తగ్గకుండా వృద్ధిచెందింది.

వాలెస్ స్టీవెన్సు ఒక రకం కవులకోవకు చెందుతాడు. ఈ కవుల కవిత్వం మొదట చదవగానే ఏమీ అంతుపట్టదు. అయితే తన సమకాలికులైన చాలమందివలెగాక ఈయన నయపడున్నవాడు. కాబట్టి ఈయన కవిత్వాని అర్థం చేసుకొనడానికి చేసే శ్రమ వృథా ప్రయాసకాదు. కవిగా, వాలెస్ స్టీవెన్సు దృష్టిలో ముఖ్యమైన అంశం: మానవుడు యథార్థమైన భౌతిక ప్రపంచంలో నివసిస్తాడు అనేది. యథార్థం అంటే కాళ్లు, వురుగులు, ఐస్‌క్రీము, నల్లపిట్టలు, కూడాలు, ఆనాసపళ్లు వంటి వస్తు, జీవసంచయం. ఆయనదృష్టిలో మరొక ముఖ్యాంశం: ప్రమబద్ధంగాను సుందరంగాను ఉన్న విశ్వంలోని ఈవస్తువులన్నిటిలో సౌందర్యాన్ని చూడగల మానవ ప్రజ్ఞ.

మానవుని భావనాశక్తినే ఆయన ఈ ప్రజ్ఞ అన్నాడు. తాను నిజంగా చూడగలిగితే చూడగలిగిన దానికి సహజ దళసుంచి కొత్త రూపు రేఖలు దిద్దగల ప్రజ్ఞ అతనికున్న దంటాడు స్టీవెన్సు. కనుకనే స్టీవెన్సు నల్లపిట్ట మీద కవనమల్లాడు. "నల్లపిట్టను చూచే 13 దృక్కోణాలు" అని తన కవిత్వానికి శీర్షిక పెట్టాడు. వాస్తవంగా చూడగల్గేది ఒక్కకోణం నుంచే. కాని అంతశ్చక్షువుతో దానిని పదమూడు రకాలుగా చూడవచ్చును పదమూడేమిటి? నిజానికి లెక్కలేనన్ని రకాలుగా చూడవచ్చును. ఈ దృష్టితో ప్రకృతిని తిలకించవలసిందిగా స్టీవెన్సు తన పాఠకుల్ని కోరాడు. అప్పుడు ఊహాశక్తితో భౌతిక యథార్థాన్ని, అతి వాస్తవ సుందరరూపంలో చూడగల దృష్టి లభిస్తుంది.

నిర్జనారణ్యంలో కూలిన చెట్టు కూడా ధ్వనిచేస్తుందా అన్న పాత ప్రశ్నవంటిదే ఇదీను. వినేవారు ఆక్కడెవరూ ఉండరు గమక ఆక్కడ పడిన చెట్టు ధ్వని చేయదు. అందాన్ని అందంగా చూచి ఆస్వాదించగల మానవుడు లేకపోతే ప్రకృతి కూడా సౌందర్యాన్ని ఇయ్యదు, ఇయ్యజాలదు. అంటే "వాస్తవిక ప్రపంచంలో వాస్తవిక సౌందర్యం" అనేది స్టీవెన్సు కవి భావన.

భౌతిక ప్రపంచంలో నివసించక పోవడమే అన్నిటిని మించిన దారిద్ర్యం. దాని తరువాత దారిద్ర్యం శుద్ధ పాదార్థిక ప్రపంచంలో జీవించడం. అనగా ప్రకృతిసౌందర్య సంపద ఉండి కూడా, దానిని సుందర రూపంలో చూచి ఆస్వాదించలేని జీవితం అని కవి భావం.

వస్తు సంచయాన్ని ఉన్నరూపంలో చూడగల శక్తిని మనకు చేకూర్చగల శక్తి కవిత్వానికి ఉన్నది. అదే దానిపని. జీవితాన్ని గురించి మానవతగురించి స్టీవెన్సు కవిభావాలు ఆధునిక కవనంలో కడు క్లిష్ట రూపంలో కనబడుతుంటవి. ఈయనను తరచు టి. ఎస్. ఇలియట్‌తో పోలుస్తుంటారు. ఇది అసహ్యతవభూషణంకూడాను, ఇలియట్ కూడా కవితా, కళా స్వభావాన్ని గురించి కవి, కళాకారుల భూమికను గురించి-ముఖ్యంగా శాస్త్ర ప్రాబల్యానికి లోనైన పందొమ్మిదవ శతాబ్దిలో ఈ భూమికను గురించి చర్చిస్తాడు. సమకాలీన జీవితంలోని అల్లిబిల్లి తనాన్ని క్రమపరచి సుందర రూపం కూర్చడానికి కళ మహోత్కృష్టమైన సాధనం అంటాడు ఇలియట్.

వాలెస్ స్టీవెన్సు 1955 ఆగస్టు రెండవ తేదీన దివంగతుడైనాడు. సరిగా అప్పటికి పది నెలల క్రితమే ఆయన కవితా సంపుటాన్ని వెలువరించి ఆ కవి 75 వ జయంతి జరిపారు. ఈ సంపుటానికి అమెరికన్ జాతీయ బహుమానాలలో ఒకటైన నేషనల్ బుక్ అవార్డు వచ్చింది. 1955 లో పులిట్జర్ బహుమానం కూడా యిచ్చారు.

"న్యూయార్కు టైమ్సు" పత్రికలో స్టీవెన్సు మిత్రుడు శామ్యూల్ ఫ్రెంచ్ మోర్స్ ఈ గ్రంథాన్ని సమీక్షిస్తూ, "కవితలో జీవితాన్ని చూడడానికి కవి యత్నిస్తాడు" అంటూ ఒక సందర్భంలో స్టీవెన్సు చెప్పిన వాక్యాలను ఉదహరించాడు. "వాలెస్ స్టీవెన్సు కవితా సంపుటి ఈ కవి మేధాశక్తికి ఫలసిద్ధి. ఈపద్యాలు అందుకు కమ్మనితార్కాణాలు... జీవితానికి లభించే ఉత్తమ వరాలలో కవితా రసాను భూతి ఒకటి అన్నాడీ కవి. కవితా రసానుభూతి ప్రశాంత జీవితంలో ఒకభాగం అని ఈ కవి విశ్వసిస్తాడు." అని ఈ సమీక్షకుడు వ్రాశాడు.

(8 వ కాలం తరువాయి).

ఎంతకలత పెట్టాయో మనం వూహించుకోవచ్చును.

ఈ మత వ్యవస్థల పుట్టుకను పరిశీలిస్తే అవి ఆనాడు పతన మౌతున్న మానవజాతిని పునరుద్ధరించడమేకాక, పునరుజ్జీవింప చేయడానికి తోడ్పడినట్లు విశదమౌతుంది. ఇక వర్ణవ్యవస్థలను పరిశీలించితే అవి ఆనాటి సమాజంలో ఆర్థిక, సాంఘిక అభివృద్ధిని కాంక్షించి ప్రతిష్ఠింప జేసినట్టిపేనని తెలుస్తుంది.

"విద్య నేర్చినవాడు విప్రుడు
వీర్యముండినవాడు క్షత్రియుడు"

అనేక వర్ణాలు ఆ కాలంలో ఏర్పడినా ఆయా వర్ణాలమధ్య సఖ్యత కొరవడలేదు. ఇచ్చిపుచ్చుకోడాలున్నాయి. మనుషులంతా ఒక్కటేనన్న భావం వారిలో వుంది. కాలక్రమాన స్వార్థపరులు స్వలాభాపేక్షతో అడ్డుగోడలు నిర్మించి పరిస్థితులను క్లిష్టం చేశారు. నాటి సమాజంలో పేరుకున్న ఈ కుళ్ళు సంతతిని కడిగి, నవ సమాజాన్ని నిర్మించడానికి కంకణం కట్టుకున్నాడు గురజాడ. సంకుచిత వాదాలను గర్హిస్తూ, అడ్డువచ్చిన ప్రతి చాందసున్ని-తన కలాన్నే కరవాలంగా చేసుకుని శిక్షిస్తూ, క్రొత్త దైవాన్ని, మతాన్ని, జాతిని నెలకొల్పి ప్రపంచాన్ని పునీతం చేశాడు.

గురజాడ ఆరాధించిన దైవం మనిషి; ఆతని మతం ప్రేమ; ఆతని జాతి ఏకైక మానవజాతి.

ప్రేమ

దేవుని, మనిషిని "ఎనలైజ్" చేసిన గురజాడ తన మతమైన "ప్రేమ" ను యిలా నిర్వచించారు:

"ప్రేమ మానవజాతికి స్వేచ్ఛను ప్రసాదిస్తుంది. దోషములు ప్రేమారాధనవల్ల క్షాళితమౌతవి. ప్రేమ అనే ధర్మమునకు కట్టుబడిన సమాజము మాత్రమే, ఆనందమును ప్రసాదించగలదు" అంటూ ప్రేమధర్మాన్ని స్పష్టపరిచారు.

ఈ "ప్రేమ"వల్ల చేకూరే ప్రయోజనాలను విశదీకరిస్తూ "యితరులను ప్రేమించడంవల్ల మానవునికి నిరవధికానందం సిద్ధిస్తున్నది. మనం ఒకరికి యిచ్చేప్రేమ మళ్ళీ మనకు ప్రేమను కొని తెస్తుంది. ఒకరినొకరు ప్రేమించుకొనడం ఎంత మహత్తరమైనదని. ఈ భూమిమీదకు స్వర్గం దిగి వచ్చినంత! భూలోక స్వర్గమే" అన్నారు గురజాడ.

అయితే, ఎట్టిది ఉత్తమోత్తమమైన ప్రేమ ఎట్టి ప్రేమ విశ్వమానవ కళ్యాణాన్ని, సౌభ్రాత్రాన్ని కలిగిస్తుంది? మొదలైన సందేహాలు కలుగవచ్చును. "మనం మూర్తీభవించ చేయవలసిన ప్రేమ విశ్వమానవప్రేమ. తోటిమానవుని హృదయమిచ్చి ప్రేమించు. నిజమైన, ఆరాధింతగగిన ప్రేమ యేది? తన యుగంలో వున్న అవధులలోనే, పోనీ, క్రీస్తు యేది బోధించాడనుకుంటున్నామో దేన్ని కళా విలాసమని, కవితా సత్యమని షెల్లీ ప్రవచించాడో; ఇదీ ఉత్తమ రాజమార్గమని దేనిని బుద్ధుడు మనకు ఉపదేశించాడో అదే నిజమైన, ఉన్నతమైన ప్రేమ: మానవజాతిపై మనకు ఉండవలసిన ప్రేమ."

"ప్రేమ" అనే రెండక్షరాలలో ఎంత మహత్త్యమున్నదో, అది ఎంతటి శక్తివంతమైనదో; ఎంత ఆకర్షణ సులభమైనదో

[మిగతా 5 వ పేజీలో]



కీర్తిశేషుడు వాలెస్ స్టీవెన్స్

రాయలు

తెనుఁగులెంక

శ్రీ తుమ్మలపల్లి సీతారామమూర్తి

కృష్ణరాయ! కళింగ మహీజిగీషఁ
గదలి శ్రీకాకుళస్వామికరుణ వడయ
నతనినన్నిధి నుపవాస మవధరించి
భక్తిచేసితివా! స్మృతి పాదనేవ
నార్చనాదుల బ్రుంగి పెల్లలసి, సొలసి
మైమఱచి నిద్రగంటివా! మధువిరోధి
నీ కలన్ గానిపించి, గోదాకుమారి
రంగమునఁ దన్ను వలచిన రమ్యకథను

దేశభాషల లెస్సయౌ తెలుఁగునందు
సందములుగుల్క నిర్మించి యస్మదీయ
చిత్త మలరింపు మని శుభాశిషము లొసఁగి
నిన్నుఁ గరఁగించెనా! మేలుకొన్న పిదపఁ
గైత వ్రాసితివా! కత్తిగట్టి పగఱ
నెద్రిచి పోరాడు జగజెట్టి కేని కేని

రక్తసంసిక్త రణవిహారములు గాక
జయ పరాజయ లాస్య దాస్యములు గాక
యిట్టికల వచ్చునా? మఱి యిది యసత్య
మనుట నీపట్లఁ బొసఁగునా? యదిర! యెంత
వింతమనుగడ నీది! భూకాంత! యెంత
సుస్థితప్రజ్ఞ నీది! నీ జోడు వచ్చు

యోగి యెవ్వఁడు? రస, రసాభోగ తృష్ణ
లొదిగె నీలోనఁ; గానిచో నురక నిన్ను
"సాహితీ సమరాంగణ సార్వభౌమ!
కృష్ణరాయేంద్ర! కృతి వినిర్మింపు" మనుచు
వివిధ విద్వజ్జనావళి వినుతిసేయ
నెంచునా? దక్షిణాపథం బెదురులేని

చేవఁ బాలించు నీవు రాసిక్య మేచి
యెంత సేయవు! కవులకై యెంత భక్తి
దాహిరింపవు! పెద్దన్న పదము పట్టి
తొడిగితివి పెండెరము; కవీంద్రుని కడాని
వల్లకీ మోసితివి; తెన్గుఁ బలుకు వెలఁది
పున్నెములు పండి కైవ్రాలి పుట్టి తీవు;

"రాయల" లనినంతనే కృష్ణరాయ లన్న
యర్థమే తోఁచుఁ గాని విద్యాపురాధి
పతులు హరిహరక్షుఖ్య లిప్పట్ల మాకుఁ
గానిపింతురె? పరమ భాగ్యమ్ము నీది,
నీ కళారాధనాసక్తి నీ కవిత్వ
సృష్టియును గారణంబు లీ శ్రేయమునకు,

నెంత సిరి యున్న నెంత విక్రాంతి యున్న
నెంత దొరతన మున్న సాహిత్య మైత్రి
లేనివాఁ డెవ్వఁడు చరిత్రలో నెసంగె?
నున్నవాఁ డెవ్వఁ డుద్దీప్తి నొందకుండె?
ధన్యతా మూర్తి వీవు విద్వత్కవీశ!
మాన్యతారాశి వీవు సమ్రాడ్వతంస!

భావసమైక్యానికి గురజాడ కృషి

"దేవుడు చేసిన మనుషుల్లారా!
మనుషులు చేసిన దేవుళ్లారా!
మీ పే రేమిటి?"

అంటూ దేవుళ్ళను, మనుషులను ఒకచోట నిల్చుండబెట్టి ప్రశ్నించాడు గురజాడ. ఆతని ప్రశ్నను మనకు అన్వయించుకుంటే-చెప్పకునే సమాధానం సిగ్గుచేటనిపిస్తుంది.

శ్రీ
ఎ. ఎస్. రామారావు

మానవాతీతమైన శక్తి ఒక టున్నదని అందరూ అంగీకరిస్తారు. ఆ 'శక్తి' నే దేవుడని మనం నమ్ముతున్నాం. అయితే, ఆ అతీతమైన శక్తికి వివిధ రూపాలు ఆపాదించి వేర్వేరు వర్గాలు పూజించడం; ఆ యా వర్గాలు తమ కొక మతాన్ని రూపొందించుకోవడం; అంతటితో సరిపెట్టుకోక అన్యవర్గాలను విమర్శించడంలోనే పరిస్థితి క్లిష్టమయింది.

ఈ శతాబ్దంలో సగం గడిచిపోయినా మనం ఇంకా పాత పద్ధతులను విడనాడక పోవడం శోచనీయం. మనం సర్వ స్వతంత్రులమైనాము. మత రాహిత్య సిద్ధాంతాను సారంగా మన రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాము. అంతమాత్రాన మతాలు కూడదని కాదు. మూఢ విశ్వాసాలను, అంధ నమ్మకాలను విడనాడాలనే మనం కోరుకుంటున్నది. మన ప్రధాని శ్రీ నెహ్రూ ఈ విషయాన్నే పదే పదే ఉద్ఘాటిస్తున్నారు.

మహాకవి గురజాడ ఈ విషయాన్ని అర్ధశతాబ్ది క్రిందటనే సుస్పష్టం కావించారు. మానవాతీతమైన ఆ శక్తిని పొంది, ఫలితాన్ని సమష్టిగా పంచుకోవడానికి సంయుక్తంగా పరిశ్రమించాలని సమస్త మానవులకూ విజ్ఞప్తి చేశారు. మానవజాతి సంఘటితం కావడానికి మత వ్యవస్థలు, కుల భేదాలు, అడ్డుగోడలు కారాదన్నారు. ఈ వ్యవస్థలు మానవుల మధ్య కావేషాలు, వైమనస్యాలు పెంచడమేకాక, అనైక్యతను పెంపొందిస్తాయన్నారు. ఈ దుష్టశక్తులకు అతీతంగా వుండాలంటూ సమస్త మానవులకూ విజ్ఞాపన గావించారు.

దేవుడు - మానవుడు

దేవుడు - మానవుడు, ఎవరు ఎవర్ని రూపొందించారు? ఇది తార్కిక విషయం. అదేవిధంగా 'దేవుడు' కూడా. మన కంటికి కనుపించని దానిని గురించి చర్చించి ప్రయోజనం లేదు. అయినప్పటికీ పరిశీలించుదాం.

దేవు డొక్కడేనని అందరు మత ప్రవక్తలూ ప్రవచించారు. అయినప్పటికీ, దైవ స్వరూపంలో వైవిధ్యం వున్నది. అదికూడా ఆ యా మతాల వారు రూపొందించుకున్నదే నని స్పష్ట మౌతున్నది. ఈ వైవిధ్యం వారి వారి విగ్రహారాధనలలో కూడా ద్యోతక మౌతుంది. ఇంతటి వైవిధ్యమున్నా ఆ యా ప్రవక్తలు దేవుడొక్కడేనని చెప్పారు. వారు కాంక్షించినది కూడా సమస్త మానవుల సౌభాగ్యాన్నే. ఈ శతాబ్దంలో జీవించిన మహాత్మాగాంధీ కూడా తన 'రామ్ ధున్'లో ఈశ్వరుడు, అల్లా, క్రీస్తు అన్నీ నీ పేరేనని పేర్కొనడం అందరికీ తెలిసిందే. భాగవతాన్ని తీసుకున్నా, భగవద్గీతను తీసుకున్నా, ఖురాను పరిశీలించినా, బైబిలును చదివినా ఈ విషయం మరింతగా స్పష్టం కాగలదు.

దైవాని కిన్ని రూపాలు సృష్టించిందెవరు? సమాధానం మానవులనే వస్తుంది. మానవుల విపరీత బుద్ధుల కివి తార్కాణాలు. భగవంతుని పేరిట తమ అపసరాలను తీర్చుకునే స్వార్థపరుల సంకుచితత్వానికి నిదర్శనాలు. వీరి ఆగడాలను అరికట్టే శక్తులు ఆ కాలంలో లేని కారణాన ఈ దుష్టశక్తులు విజృంభించి సమాజాన్ని కలుషితం చేశాయి. మానవుల హృదయాలలో విషాన్ని నింపారు. అయినప్పటికీ వారి ఆటలు సాగలేదు. విప్లవ శక్తులు ప్రయత్నిస్తూనే వున్నాయి. ఆధునికయుగంలో ఈ విప్లవానికి సారథ్యం వహించిన మొదటి వారిలో మహాకవి గురజాడ ఒకరు. తన కలంలోని అమృతంద్వారా సమాజాన్ని జీవితం చేయడాని కుపక్రమించారు.

"మనిషి చేసిన రాయి రప్పకి
మహిమ కలదని సాగి మొక్కుతు
మనుషు లుంటే రాయి రప్పల
కన్న కన్నిష్టం"

అంటూ తన 'మనిషి' అన్న గీతంలో సంకుచితవాదులను విమర్శించారు.

సమస్త ప్రాణికోటిలోను మానవ జన్మ ఉత్కృష్టమైనది. ఈ విషయాన్ని అన్నీ మత గ్రంథాలు చెబుతాయి. అందు కు కారణం ఏమిటి? ఆ కారణాన్ని మహాకవి ఇలా నిర్వచించారు:

"భావనాశక్తి మానవులకు ఒక వరం వంటిది. ఇది మనుష్యులంతా సమానమే అన్న దృష్టిని కలిగిస్తుంది. మానవులను ప్రజాస్వామిక గుణసంపన్నులను కావిస్తుంది" అంటారు గురజాడ.

భావనాశక్తి లేమిచే, గుడ్డిగా విగ్రహారాధన చేస్తూ భగవంతుణ్ణి ప్రసన్నుని కావించుకొనాలనుకోవడం అవివేకం కాక మరేమిటి? దేవుడెక్కడో లేడు. పూజలూ, వ్రతాలు చేయడం వృథా. సాటి మానవుణ్ణి ప్రేమించడంలోనే దైవాన్ని ప్రసన్నుని చేసుకోవచ్చని; అదే ముక్తికి దగ్గరతోవని హెచ్చరిస్తూ,

"కన్ను తెరచిని కానబడదో?
మనిషి మాత్రుడి యందు లేదో?
ఎరిగి కోరిన కరిగి యీదో
ముక్తి?"

అంటూ మానవజాతిని జాగృతం చేశాడు గురజాడ. 'గీత' చెప్పిన రహస్యం కూడా ఇదే. గీతా రహస్యాన్నింత విపులంగా నిర్వచించ గలిగిన మహనీయుడు గురజాడ.

మత, వర్ణవ్యవస్థలు

దేవుని పేరున వెలసిన మతాలను, కులాలను చూసి గురజాడ దారపడి సంతగా మరొకరు దారపడలేదేమో: "ప్రజల ఐక్యతకు వర్ణవ్యవస్థ అనేది గొప్ప ఆటంకంగానూ, అడ్డుగోడ వలెనూ లేదా? మతనమ్మకమనేది ప్రస్తుతం భారతదేశంలో అభివృద్ధి అవుతున్నదా? లేక నశించుతున్నదా?" మొదలయిన ప్రశ్నలను గురజాడ తనకు తానుగా వేసుకోవడాన్నిబట్టి ఈ వ్యవస్థలు ఆతనిని

[మిగతా 2 వ కాలంలో]

సమస్యాపూరణం

జానుగ నాడు పల్కులకు
సమ్మతి గాదుము లాతివాడనా!
కాను, భవత్సహోదరుడ
గాని ధరానుత మీది మోహమున్
మానుము రాధువుందు సర
మాత్రుడె? అమ్మహనీయుతోడ వై
రానుగతుండవై చెడకు
మైహిక సౌఖ్యము గోరి రావణా!

అబ్బరాజు వెంకటేశ్వరశర్మ.

* * *

జాను తెనుఁగన్న మిక్కిలి సంతసింతు
కానుకల నిత్తు దేవునిఁగాంచినపుడు
మానుగా నాశరీయ సమ్మానములను
రాను వాదానేరితోనైన నేను

కోగంటి దుర్గామల్లికార్జునరావు

* * *

జానుగలట్టి వారలల స్వర్గమె కాపుర
మైన వారు, లో
కానుగుణ ప్రభావులగు నాసుర
నాయకులన్ పరించుటల్
మానుచు నన్ను గోరెదవె? మానవుడన్
దివిజాళిఁ బోలగా
రాను రవంతయంచు, నలరాజమరన్
దమయంతితో ననెన్.

"ఫణి కుమార్"

* * *

జాను కవిత్వ రీతుల, సుశబ్ద సుధావ
సుమాధురీకృతుల్
కానుకలిచ్చి మెచ్చుకొనగన్ రచియించెదు
గ్రంథకర్తలే
మానుషవంతు; లాకృతులు మాన్యతగూర్చు
నజప్రసూంద్ర పౌ
రాను చరిత్రకున్; తెలుగులం దుదయించు
వికాస చంద్రికల్.

పృథివి సుబ్బనాగయ్య.

* * *

జాను తెలుంగులో గల వసందగు రీయని
భావసంపదల్
కానుక చేయగాదలచి కమ్మని పద్యము లల్లి
పేరె సా
మాను రవంత లేక, తన మామను గొప్పగ
కీర్తి సేసె; నౌ
రా! సుతిపాత్రుడేగద ధరాస్థలి మామ
యనంగ నెంతయున్.

వై. రాఘవేంద్ర.

* * *

జానువులంట కోకముడి జూర్చివయింబడరాదు, వేళ్యనే
కాను. రతి ప్రియత్వమును కామక
ధర్మము నింద్యకర్మ మా
మానుచు సుధామధుప్రణయమగ్నను రాధను
యిట్లు సేయగా
రాను ఆటన్న నవ్వి యదురత్నము లాగెను
చీరకేరుచున్.

వావిలకొలను లక్ష్మీనరసింహారావు.

* * *

"జాను విదళన మొనర్చక
కాను వృకోదరుండ నేను, కలుష
వదనముల్
మాను సుయోధన! నీ సమ
రానుభవము జూపు మెత్తుననె భీముఁడినిన్"!

పతి వేణుగోపాలశర్మ.

* * *

"జానుగ నా మనమ్మున నజప్రమ
ధ్యానమొనర్తు నా త్రలో
కానునయ క్రియాచణ దయార్ద్రవి
లోకను, గృష్ణు, శాంబరీ
మానుష దేహునిం, బరమ మంగళ
దాయకు, సాధుభక్త వా
రాను వదస్వభావు, భువనాధిపు,
నిత్యశుభాభిలాషినై.

చిమట సత్యనారాయణరావు.

* * *

జాను తెనుంగున నుడివెద,
కానున్నది కాకపోదు కావున నిలలోన్
మానుడు చింతించుట నెడ
రానున్నది రాకపోదు రాజులకైనన్.

వై. జోజి

* * *

జాను బంగారు హరిణమ్ము జానకి కని
కానుకగ దనకీయ, రాఘవుని పేర;
"మాను" మది పట్టి రాక్షస మాయయని, పు
రాను గత విధింజనలేదె? దానివెంట!

షేక్ మీరా మొహియుద్దీన్.

* * *

జాను వర్యంతదాహువుల్. సతతసమధి
కాను కూలచిత్తంబు, ద యాంబుధి నన
మాను నా ప్రియ హృదయమే మగుప
గానెనా
రానురాను వాని నిరాద రము ఘటిల్లె.

శ్రీరామ్ వీరబ్రహ్మకవి

* * *

జానుగ వేణువూది కనునన్నలతో ననుటల్వ
(దేమలో
కానుభవంబు గూర్తువని యార్మఁదలంచి.
సమాశ్రయించితిన్
మానుము బింకమింక నభిమానముతోఁ(ద్వరఁ
ద్రోవుమయ్య! ధీ
రానుగుణంబుతా గుణములాత్మఁదలంపుము,
నందనందనా!

కల్యాణం వీరాస్వామి.

* * *

జాను తెనుంగు లేదనుది సంపద సొంపున
నింపునింప, లో
కాను భవమ్ము తెల్లముగ నాభరతాన్వయ
రాట్చరిత్రముల్
మానుగ జెప్పినట్టి కవి మండల మండనుఁ
దిక్కనార్యు నౌ
రా! సుతియింప శక్యమె సహస్ర శిరంబుల
వానికైననున్॥

వేమూరి సుబ్రహ్మణ్యశర్మ.

దత్త పది

భయము, రయము,
హాయము, సయము,

కుష్ఠువుల డాక్టరుగారి రాక!

మా డాక్టరుగారగు
వైద్యశ్రీ
శ్రీ గ్రంధే రఘురామగుప్త
ఈ క్రింద వివరించబడిన
విధముగ పర్యటించెదరు

23—3—62 శుక్రవారము;
24—3—62 శనివారము:
శ్రీ రాధాకృష్ణ లాడ్జింగ్ హోమ్,
జి. ఎన్. టి. రోడ్, ఏలూరు.

26—3—62 సోమవారం;
27—3—62 మంగళవారం:
హనుమాన్ టాకీస్, రాజమండ్రి.

29—3—62 గురువారం:
మోడరన్ కేఫ్ (జిల్లా మునసఫ్ కోర్టుకు ఎదురుగా), విజయనగరం.

31—3—62 శనివారం:
వి. వి. జి. శెట్టిగారి సత్రం, రైల్వేస్టేషన్ సమీపంలో, బరంపురం.

2—4—62 సోమవారం:
సమయమంతుల
సోమరాజుగారి సత్రం, తుని.

6—4—62 శుక్రవారం;
7—4—62 శనివారం:
రూము నెం. 17, శంకర్‌షేర్ హోటల్, అఫ్‌జల్‌గంజ్ (గౌలిగూడదమన్ దగ్గర), హైదరాబాదు.

9—4—62 సోమవారం:
రూము నెం. 5, యాస్రిబ్ లాడ్జింగ్, హన్మకొండ, వరంగల్.

11—4—62 బుధవారం:
సి. కె. బిల్డింగ్స్ (ధర్మశాల), రైల్వేస్టేషన్ దగ్గర, రాయచూరు R S.

14—4—62 శనివారం: రాయల్ రిఫ్రెషింగ్ రూమ్స్, అనంతపురం.

తుష్ఠు, బొల్లి, మేహ మచ్చలు, మేహ పొక్కులు, మేహ గ్రంధులు, నపుంసకత్వము, పక్షవాయువు, బోదకాళ్ళు, పిచ్చి, మూర్ఛ, హిస్టీరియా, ఉబ్బసము, టి. బి., డయాబెటీస్ (చెక్కెర వ్యాధి), సుఖవ్యాధులు, క్యాన్సర్ - సమస్త మొండి వ్యాధులకు సలహాలు, ఔషధములు యిచ్చబడును. కేటలాగులు కోరికపై ఉచితముగ పంపబడును.

డాక్టరుగారితో సంప్రదించుటకు రుసుము రు. 5-00

పాత రోగులకు సలహా ఉచితము

గమనిక: డాక్టరుగారి వద్ద ఔషధములు లభించును. ఔషధములు తీసికొనగోరువారు డాక్టరుగారికి పూర్తి మొత్తము చెల్లించి తీసికొనవచ్చును. ఔషధమునకు ఆర్డరిచ్చువారు డాక్టరుగారికి కనీసము రూ 20/- లు అడ్వాన్సుగా చెల్లించిన, మిగతా పైకమునకు ఔషధములు కంపెనీ నుండి వి. పి. గా పంపబడును.

ఫోన్ నెం: 22.
టెలిగ్రాం: "లెప్సిన్".

మేనేజర్,
"అమరజ్యోతి ప్రాడక్ట్స్"
మార్కాపురం, కర్నూలు జిల్లా.

పారిశ్రామికంగా రాష్ట్ర పురోభివృద్ధి సాధన

—గవర్నర్ ప్రసంగం వివరాలు

హైదరాబాద్, మార్చి 20— ఆంధ్రప్రదేశ్ శాసనసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ శ్రీ సచార్ ప్రసంగం ప్రధాన భాగాన్ని "ఆంధ్రజ్యోతి" నిన్ననే ప్రకటించింది. మిగిలిన వివరాలను దిగువ పొందుపరుస్తున్నాము. —ఎడిటర్.

కొల్లేరు భూములలో 20 వేల ఎకరాలు ముంపుకు లోనుకాకుండా కాపాడడానికి ఉద్దేశించిన బుడమేరు మళ్ళింపు పథకం పూర్తి అయిందని ఆయన చెప్పారు.

పెక్కు ఇతర వరద నిరోధక పథకాలకు సంబంధించిన పనికూడా కొనసాగిస్తున్నట్టు గవర్నర్ తెలియజేశారు.

కృష్ణా డెల్టాకు నాగార్జునసాగర్ నీరు

నాగార్జునసాగర్ నుంచి 1962-63 వ సంవత్సరంలో కృష్ణాడెల్టాలో రెండవ పంట కింద 1.5 లక్షల ఎకరాలకు నీరు వదలడానికి ఉద్దేశింపబడిందన్నారు.

తెలంగాణా ప్రాంతం వెనుకబడి వున్నందున హైడ్రో-థర్మల్ పథకానికి గాను 18.57 కోట్ల రూపాయల మేరకు ఏక అంచనా మొత్తాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన చెప్పారు.

కొత్తగూడెం థర్మల్ పథకాన్ని, రామగుండం విస్తరణ పథకాన్ని అమలు చేయడానికి మంజూరు చేయబడినవని కూడా గవర్నర్ తెలియజేశారు.

విజయవాడ విద్యుత్ కేంద్రాన్ని గత డిసెంబర్‌లో ప్రభుత్వం స్వాధీనం చేసికొనడంతో రాష్ట్రంలోని విద్యుచ్ఛక్తి సంస్థలన్నింటిని ప్రభుత్వం జాతీయం చేయడం పూర్తి అయిందని శ్రీ సచార్ అన్నారు.

పంచాయతీ రాజ్యవ్యవస్థ గురించి ప్రస్తావిస్తూ షెడ్యూలు ప్రాంతాలన్నింటిలోను పంచాయతీలను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక చర్యలు తీసికొనబడ్డాయన్నారు.

వచ్చేకొద్ది వారాలలోను ఈ ప్రాంతాలలో పంచాయతీలను ఏర్పాటు చేయడం పూర్తి అవుతుందని తెలియజేశారు.

షెడ్యూల్డు ప్రాంతాలలో కూడా సమాజికాభివృద్ధి బ్లాకులలో పంచాయితీ సమితులు స్థాపించ బడతాయన్నారు.

పారిశ్రామికాభివృద్ధి

భారీ, మధ్యరకం పరిశ్రమల స్థాపన గురించి తెలియ జేస్తూ, పారిశ్రామికీకరణ త్వరితగతిని జరగడానికి వీలుగా ప్రయివేట్ రంగానికి సంబంధించి సంతవరకు మన ప్రభుత్వం ఉదారభావాన్ని, సరళవైఖరిని చూపుతున్నదని, భారీ, మధ్యరకం పరిశ్రమలను స్థాపించి ప్రజా శ్రేయస్సు కోసం మన వనరులన్నిటిని వినియోగించడానికి ముందుకురావడానికి రాష్ట్రం లోపల, వెలుపల వుండే పారిశ్రామికులకు ప్రోత్సాహమివ్వడం మన ప్రభుత్వ సుస్థిర విధానమని శ్రీ సచార్ ఉద్ఘాటించారు.

బొగ్గు ఉత్పత్తి

రాష్ట్రంలో సాలుసరి బొగ్గు ఉత్పత్తి 26.5 లక్షల టన్నులు అని, మూడవ ప్రణాళికాంతానికి సుమారు 56.5 లక్షల టన్నుల వరకు పెంచడానికి సింగరేణీ బొగ్గుగనుల కంపెనీవారు పథకం రూపొందించారన్నారు.

ఆయుర్వేద కళాశాల స్థాపన

వైద్యం, ఆరోగ్య సదుపాయాలగురించి ప్రస్తావిస్తూ, 15 లక్షల రూపాయల ఖర్చుతో ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనకు ప్రభుత్వ అమోదం లభించిందని, మూడవ ప్రణాళిక కాలంలో దానిని ప్రారంభిస్తారని చెప్పారు.

ఈ కళాశాలను ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధం చేసేవిషయంలో తగు చర్య తీసికొన బడుతుందని చెప్పారు.

బంజరు భూముల పంపకం విషయంలో ప్రభుత్వం తగు శ్రద్ధ చూపుతున్నదని, ఇప్పటివరకు 8,61,344 ఎకరాలు కేటాయింపు జరిగిందని తెలియజేశారు.

రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు సాఫీగాను, శాంతియుతంగాను నిర్వహించినందుకుగాను ఉద్యోగులను అభినందించారు.

ప్రాచీనమైన మన భూమిలో ప్రజాస్వామ్యం అనే చెట్టు వ్రేళ్ళు చాలగట్టిగా నాటు కొన్నవని నిరూపితమైందన్నారు.

పరిపాలనా సంస్కరణలు

పరిపాలనా సంస్కరణల గురించి ప్రస్తావిస్తూ ప్రభుత్వ కార్యాలయాలు మరింత సమర్థంగా పనిచేసేటట్టు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పరిపాలన సంస్కరణల కమిటీ సిఫారసులు త్వరితగతిని అమలుపరచబడుతున్నవని, మిగిలిన వాటిని ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలిస్తున్నదని తెలియజేశారు.

1962 - 63 వ సంవత్సరపు బడ్జెను ఈ సమావేశంలో పరిశీలిస్తారన్నారు.

ఈ సమావేశంలో చర్చకువచ్చే కొన్ని శాసనఅంశాలను గురించి ఇలాతెలియజేశారు:

1952 ఆంధ్రప్రదేశ్ మోటార్‌బండ్ల (ప్రయాణీకులపై, సరకులపై) పన్నుల చట్టం చెల్లుబడిని పొడిగించే బిల్లు.

మునిసిపల్ కౌన్సిలర్ల పదవీ కాలాన్ని మూడేళ్ళనుంచి అయిదు సంవత్సరాలవరకు పొడిగించే 1920 ఆంధ్రప్రదేశ్ జిల్లా మునిసిపాలిటీల చట్టం సవరణబిల్లు, మునిసిపల్ కౌన్సిల్స్ పునర్నిర్మాణాన్ని అనువైన కాలంవరకు వాయిదా వేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి అధికార మిచ్చే మరొకబిల్లు.

రాష్ట్రంలో ప్రస్తుతం వున్న సహకార కేంద్రం బ్యాంకులను విలీనం చేసేబిల్లు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం, క్రమబద్ధమైన మార్కెట్లు, సహకార సంఘాలు గిడ్డంగులు - వాటిస్థాపనకు సంబంధించిన బిల్లులు.

పట్టీ వ్యాపారం, వినిమయ నియంత్రణకు సంబంధించిన బిల్లులు ఈ శాసన సభా సమావేశంలో చర్చకు వస్తాయన్నారు.

రాష్ట్ర ప్రభుత్వోద్యోగాలలో చేరడానికి ఉరుదు ప్రాంతీయ భాషగా అంగీకరించడం జరిగిందని గవర్నర్ అన్నారు.

తెలుగు మాతృభాషగా కల ప్రభుత్వోద్యోగులు హిందీ లేక తెలుగు, లేదా హిందీ లేక ఉరుదులో టెస్టు పాస్‌కావాలని ఆయన తెలియ జేశారు.

తెలంగాణాలోని తొమ్మిది జిల్లాలలో ప్రభుత్వానికి పంపే కాగితాలను ఉరుదూలో పంపవచ్చునని ఆయన చెప్పారు.

మూడవ ప్రణాళిక

మూడవ ప్రణాళికకు మొత్తం 305 కోట్ల రూపాయలు నిర్ణయించడం జరిగిందని, కాని కేంద్ర సహాయం, మన వనరులనులెఖ్ఖలోకి తీసుకొంటె మొదటి సంవత్సరం కార్యక్రమానికి 48.54 కోట్లు మాత్రమే మంజూరు చేయడం సాధ్యం కాగలదని గవర్నర్ పేర్కొన్నారు.

ప్రాంతీయ సంఘం సిఫార్సుల ననుసరించి తెలంగాణా అభివృద్ధి ప్రత్యేక పథకానికిగాను కేటాయించిన మూడు కోట్లుకూడా ఈ మొత్తంలో జమపడుతుంది.

కేంద్రం మొదటి సంవత్సరానికి 31 కోట్ల రూపాయలు కేటాయించినందున మిగిలిన 17.54 కోట్లు మనమే సమకూర్చు కోవాలని గవర్నర్ అన్నారు.

మూడవ ఫైనాన్స్ కమిషన్ సిఫార్సులు ఇప్పుడే ప్రభుత్వానికి అందాయని, ఈ సిఫార్సులు అంత కంతకు అధిక మౌతున్న రాష్ట్ర అవసరాలను తీర్చడానికి వుపయుక్తంగా వుండగలవని ఆయన అన్నారు.

మన ప్రణాళికను పూర్తిగా అమలు జరపాలంటే ఆదాయం వచ్చే మార్గా లన్నింటినీ పూర్తిగా వినియోగించుకోవాలని శ్రీ సచార్ ఉద్ఘాటించారు.

సెంట్రల్ మెడికో లీగల్ ఇనిస్టిట్యూట్‌ను హైదరాబాద్‌వద్ద ఏర్పాటు చేసే ప్రతిపాదన కలదని ఆయన వెల్లడించారు.

స్కూలు ఉపాధ్యాయుల కష్టాలను తొలగించడానికి ఏర్పాటైన ఉపాధ్యాయుల శ్రేయస్సు జాతీయ సంస్థకు విరాళంగా రాష్ట్ర ప్రభుత్వం 25 వేల రూపాయలు మంజూరు చేసిందని ఆయన తెలియజేశారు.

ఉద్యోగుల జీవిత భీమా పథకాన్ని రాజమండ్రి, భువనేశ్వరం, కర్నూలు, రేణిగుంటలకు ఈ సంవత్సరంలో విస్తరింపచేయడానికి నిర్ణయించడం జరిగిందని గవర్నర్ వెల్లడించారు.

అనంతపూర్, కర్నూలు, శ్రీకాకుళం, విశాఖపట్నం, చిత్తూరు, నెల్లూరు, హైదరాబాద్ జిల్లాలలో కొన్ని ప్రాంతాలలో తప్ప మిగిలినచోట్ల పంటల పరిస్థితులు బాగానే వున్నాయని ఆయన చెప్పారు.

తక్కావి ఋణాలకు ప్రభుత్వం అదనపు మొత్తాలను మంజూరు చేసిందని గవర్నర్ చెప్పారు.

గవర్నర్ ప్రసంగం : ప్రతిపక్షనాయకుల విమర్శ

ఉభయసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ ప్రసంగించి నప్పుడు నదీజలాల సమస్యపై చేసిన ప్రస్తావనలను ప్రతిపక్ష నాయకులు విమర్శించారు.

స్వతంత్ర గ్రూపు ఉపనాయకుడు శ్రీ రాజగోపాల నాయుడు విలేకరులతో మాట్లాడుతూ, ఈ ప్రధాని సమస్యపై ఇది పరకటి ప్రభుత్వం అవలంభించిన వైఖరికి భిన్నమైన వైఖరిని ప్రస్తుత ప్రభుత్వం తీసుకొన్నట్టు కనబడుతున్నదని విమర్శించారు.

గవర్నర్ ప్రసంగంచేయడానికి పూర్వమే నదీజలాల సమస్యపై మెత్తదనం కూడదని తాను హెచ్చరించానని శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు అన్నారు.

ఈ విషయంలో ప్రజల భావాలను ప్రేరేపించాలని, అఖిలపక్ష సమావేశాన్ని మళ్ళీ ఏర్పాటు చేయాలని ఆయన ఉద్ఘాటించారు.

గవర్నర్ ప్రసంగం నిరుత్సాహంగా వున్నదని శ్రీ విశ్వనాథం వ్యాఖ్యానించారు.

గవర్నర్ ప్రసంగం ఋషిమంపంటి యదార్థ జీవిత పరిస్థితులను ప్రతిబింబించడం లేదని కమ్యూనిస్టు-ఇండిపెండెంట్ లెజిస్లేటర్సు ఫ్రంట్ ఉపనాయకుడు శ్రీ నాగిరెడ్డి విమర్శించారు.

శ్రీ సచార్ పాతపథకాలనే పునరుద్ఘటించారని, మూడవ ప్రణాళికలలో అభివృద్ధి సాధించే సూచనలు కనబడడం లేదని ఆయన అన్నారు.

గవర్నర్ ప్రసంగం ఉత్తేజ పూరితంగా లేదని. దీనినిబట్టి ప్రభుత్వానికి నిర్దుష్టమైన విధానంలేదని బోధపడుతున్నదని శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య వ్యాఖ్యానించారు.

అధికార భాషగా తెలుగును ఏర్పాటు చేసే విషయమై ఆప్రసంగంలో ఎట్టి ప్రస్తావనలేదని, పరిపాలనా సంస్కరణల సంఘం సిఫార్సులను అమలు జరపడం జరగలేదని ఆయన విమర్శించారు.

శాసన సభల సంయుక్త సమావేశం సరిగ్గా 20 నిముషాలసేపు జరిగింది.

గవర్నర్ శ్రీ సచార్ ప్రసంగించడానికి వచ్చినప్పుడు ఆయనను స్పీకర్ శ్రీ సుబ్బారెడ్డి, కౌన్సిల్ చైర్మన్ శ్రీ హనుమంతరావు తోడ్కొనివచ్చారు.

శ్రీ సచార్ తెలుగులో ఉపన్యాసాని ప్రారంభించారు. తెలుగులో ఒక వాక్యం చదివిన తరువాత ఆయన ఉర్దూలో మరొక వాక్యం చదివారు. ఆ తరువాత మిగిలిన ఉపన్యాసాన్ని ఇంగ్లీషులో చేశారు.

సంయుక్త సమావేశం తరువాత గవర్నర్ రాజభవన్ తోటలో కొత్తమంత్రులకు, శాసనసభ్యులకు తేనీటివిందు చేశారు.



యూరోపియన్ ఆర్థిక మండలి అధ్యక్షుడు ప్రొఫెసర్ హాల్‌స్టీన్‌కు భారతీయ ఆర్థిక రాయబారవర్గ నాయకుడుగా శ్రీ కె. బి. లాల్ అధికార పత్రాలు సమర్పిస్తున్న దృశ్యం

కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల స్థితిగతులు

పరిశీలనా సంఘం నివేదికపై త్వరలో ప్రభుత్వం నిర్ణయాలు

న్యూఢిల్లీ, మార్చి 20—

కేంద్ర ప్రభుత్వోద్యోగులను స్థితిగతుల గురించి అంతర్ శాఖా సంఘం సమర్పించిన నివేదికపై ప్రభుత్వ నిర్ణయాలు రెండు, మూడు నెలలలో వెలువడగలవని కేంద్ర హోంమంత్రి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నేడు రాజ్యసభలో తెలియజేశారు.

శ్రీ విఠల్‌రావు అడిగిన ప్రశ్నకు శ్రీ శాస్త్రి సమాధానమిస్తూ ఆ సంఘం నివేదికను తాను పరిశీలించానని కేంద్ర ప్రభుత్వ సిబ్బంది దృష్ట్యా అందులోని సూచనలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు.

అయితే ఈ సంఘం చేసిన సిఫారసులు ఢిల్లీలోని ఉద్యోగులకు మాత్రమే పరిమితం కాగలదని, దేశంలోని ఇతర ప్రాంతాల వారికి కూడా వాటిని వర్తింపచేయడం ఏమంత కష్టం కాదని ఆయన అన్నారు.

ఈ విషయాన్ని తాను క్షుణ్ణంగా పరిశీలించి ఇతర ప్రాంతాలలో ఉన్న కేంద్ర ప్రభుత్వోద్యోగులకు కూడా సంఘ సిఫారసులను వర్తింప చేయడానికి ప్రయత్నిస్తానని ఆయన చెప్పారు.

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోనికి వచ్చినప్పటినుంచి ఇప్పటివరకు పోలీసుల కస్టడీలోఉన్న వ్యక్తులు నల్గురు. వారిలో జైలులో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డారని కేరళరాష్ట్ర హోంమంత్రి శ్రీ పి. టి. చాకో మార్చి 19 వ తేదీన అసెంబ్లీలో చెప్పినట్టు తెలుస్తున్నది.

1962 - 63 బడ్జెట్‌పై చర్చ

న్యూఢిల్లీ, మార్చి 20—1962-63 సంవత్సరపు తాత్కాలిక బడ్జెట్‌పై లోకసభ నేడు చర్చ ప్రారంభించింది.

కమ్యూనిస్టు సభ్యుడు శ్రీ టి. బి. విఠలరావు మొదట ప్రసంగిస్తూ ధరలపెరుగుదల అరికట్టబడినట్టు ఆర్థికమంత్రి తన ప్రసంగంలో చెప్పిన విషయాన్ని ఖండించారు.

కొన్ని వస్తువుల ధరలు మరింత పెరిగినవని కూడా ఆయన అన్నారు.

తృతీయ ప్రణాళికా కాలంలో ధరల స్థాయిని కాపాడడం జరుగుతుందని హామీ ఇచ్చి కూడా ప్రభుత్వం ఈ ప్రణాళిక మొదటి సంవత్సరంలో బొగ్గుధరను మూడు రెట్లు పెంచినదని ఆయన అన్నారు.

పారిశ్రామిక విధానానికి సంబంధించిన తీర్మాన్ని ప్రభుత్వం అతిక్రమించినట్టు ఆయన ఆరోపించారు. ఉక్కు ఉత్పత్తి విషయంలోను, పారిశ్రామిక గృహ నిర్మాణ విషయంలోను ప్రభుత్వం తన లక్ష్యాలను సాధించ లేక పోయినదని శ్రీ విఠలరావు విమర్శించారు.

గృహ నిర్మాణానికి ఎల్.ఐ.సి. తోడ్పాటు

కొత్త అధ్యక్షుడు శ్రీ కౌల్ వివరణ

కాన్పూరు, మార్చి 19—జీవిత భీమా సంస్థ కొత్త అధ్యక్షుడు, శ్రీ బి. కె. కౌల్ నేడిక్కడ మాట్లాడుతూ, సకాలంలో పరపతి సౌకర్యాలను కల్పించడంద్వారా గృహ నిర్మాణంవంటి కార్యక్రమాలకు తోడ్పడడం కార్పొరేషన్ లక్ష్యం కావాలని తాను భావిస్తున్నట్టు తెలియజేశారు.

వ్యాపార విస్తరణకన్న పాలసీహోల్డర్లప్రయోజనాలు మరింత శ్రద్ధ వహించేటట్టు చూడ గలనని శ్రీ కౌల్ హామీ నిచ్చారు.

తమ వ్యాపారం విపరీతంగా పెరగడం వల్ల ఎంతపెద్ద కంపెనీ అయినా ఇదివరకెన్నడూ ఎదుర్కొనని సమస్యలను తాము ప్రస్తుతం పరిష్కరించ వలసి వస్తున్నదని ఆయన అన్నారు.

వ్యాపారం హెచ్చుగా జరుగుతున్నా బోనస్ తక్కువగా వుండడానికి కారణమేమిటని ప్రశ్నించగా, అది వాస్తవమైన విలువలను బట్టి వుంటుందని ఆయన అన్నారు.

అదనపు సుంకాల చట్టం సవరణ

బిల్లుకు లోకసభ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 20-అదనపు ఎక్సైజు సుంకాల చట్టం (ప్రత్యేక ప్రాముఖ్యగల సరుకులు) సవరణకు ఉద్దేశించిన బిల్లును లోకసభ నేడు ఆమోదించింది.

ప్రభుత్వం ఆమోదించిన ప్రకారం మూడవ ఫైనాన్సుకమిషన్ సిఫారసుల అమలుకు అవకాశం కల్పించే నిమిత్తం ఇది ఉద్దేశించబడింది.

ఈ బిల్లును ప్రతిపాదించిన కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ ప్రసంగిస్తూ మూడవ ఫైనాన్సు కమిషన్ వివిధ రాష్ట్రాల మధ్య ఆదాయాన్ని న్యాయసమ్మతంగా పంపిణీ చేసినదని, క్లిష్టతరమైన పరిస్థితిలో అది తన కర్తవ్యాన్ని సక్రమంగా నిర్వర్తించినదని అన్నారు.

కొన్ని సరుకులపై సుంకాలు విధించే సందర్భంలో రాష్ట్రాల స్వాతంత్ర్యాన్ని కేంద్రం తన చేతిలోనికి తీసివేసుకుంటున్నదన్న ఆరోపణలు నిరాధారమని ఆయన చెప్పారు.

నిజానికి అదనపు సుంకాలద్వారా వచ్చే మొత్తమంతా రాష్ట్రాలకే పంచిపెడుతున్నట్టు ఆయన తెలిపారు.

రైల్వే సప్లిమెంటరీ డిమాండ్లు

లోకసభ ఆమోదం

న్యూఢిల్లీ, మార్చి 20 — 1961-62 సంవత్సరానికి రైల్వేలకు గ్రాంట్లుకుగాను వుద్దేశించిన సప్లిమెంటరీ డిమాండ్లు బిల్లును నేడు లోకసభ ఆమోదించింది. అందుకు సంబంధించిన 59,72,000 రూపాయల అప్రోప్రియేషన్ బిల్లును కూడా లోకసభ ఆమోదించింది.

ఈ మొత్తంలో అయిదు లక్షలు ఇదివరకే నిర్మించిన మార్గాలకు చెల్లిస్తారు.

బ్రాంచి మార్గాలను ప్రయివేటు వ్యక్తుల వద్ద నుంచి స్వాధీన పరచుకోవాలని, వారికి సబ్సిడీలను ఇవ్వడం నిలపాలని శ్రీ టి. బి. విఠల్‌రావు ప్రభుత్వాన్ని కోరారు.

మార్గాలను స్వాధీనపరచు కొన్నప్పుడు కుదిరిన ఒప్పందిక ననుసరించి తూర్పు, ఆగ్నేయ రైల్వేలలోని నాలుగు మార్గాలకు ఇప్పుడు సబ్సిడీలు ఇవ్వడం జరుగుతున్నదని, ఆ ఒప్పందాల గడువు పూర్తి అయిన తరువాత ఈ విషయాన్ని పరిశీలిస్తామని రైల్వే ఉపమంత్రి శ్రీ ఎస్. వి. రామస్వామి సమాధానం చెప్పారు.

అమెరికానుంచి డీసెల్ రైలు ఇంజన్ల దిగుమతిని నిలిపివేయాలని శ్రీ విఠల్‌రావు సూచించారు.

గూడ్సు రవాణా ఎక్కువగా వున్నందున డీసిల్ ఇంజన్లను వుపయోగించడం తప్పదని, వారణాసిలోని డీసిల్ రైలు ఇంజన్ల కర్మాగారం సాధ్యమైనంత త్వరలో ఉత్పత్తి ప్రారంభించేటట్టు చూస్తామని ఉపమంత్రి వివరించారు.

ఉపనిషత్తుల పర్షియన్ అనువాద గ్రంథం మార్చి 20 వ తేదీన రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌కు బహూకరించ బడింది. వీటిని శ్రీ జలాలీనైని అనువదించారు.

శ్రీమతి కెనెడీకి బహూమతులు

న్యూఢిల్లీ, మార్చి. 20—ఇండియా పర్యటన శ్రీమతి జాక్విలన్ కెనెడీకి చాలా ఆహ్లాదం కలిగించినదని వాషింగ్టన్‌లోని ఇండియా రాయబారి శ్రీ బి. కె. నెహ్రూ నేడిక్కడ చెప్పారు.

శ్రీ బి. కె. నెహ్రూ శ్రీమతి కెనెడీతో పాటు ఆగ్రా, వారణాసి, ఉదయపూర్, జయపూర్‌లకు వెళ్ళారు.

శ్రీమతి కెనెడీ కొద్దిగా అలసటచెందినా ఈ పర్యటన ఆమెకు సంతోషదాయకంగా వున్నట్టు ఆయన తెలిపారు.

శ్రీమతి జాక్విలన్ కెనెడీ పర్యటనపై మీ వ్యక్తిగతాభిప్రాయ మేమిటన్న ప్రశ్నకు శ్రీ బి. కె. నెహ్రూ సమాధానమిస్తూ ఆమెపట్ల ప్రజానీకం చూపిన స్నేహభావం, అందు కామె వెల్లడించిన కృతజ్ఞత తనకు విశేషంగా ఆసక్తి కలిగించినవన్నారు.

శ్రీమతి కెనెడీ వ్యక్తిగత హోదాలో పర్యటిస్తున్నందున ఇంత ప్రజాసమూహం ఆమెను చూడడానికి ఆసక్తి కనబరచగలదని తాము భావించలేదని ఆయన చెప్పారు.

రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ నేడు శ్రీమతి కెనెడీకి ఒక దంతపుదీపాన్ని, ఆమె సోదరికి ఒక దంతపు పౌడరు పెట్టెను బహూకరించారు.

ఉపరాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ శ్రీమతి కెనెడీకి ఒక తంజావూరు ప్లేటు బహూకరించారు.

శ్రీమతి కెనెడీకి ప్రధాని నెహ్రూ అందజేసిన బహూమతులలో ఒక తివాసీ, 12 పుస్తకాలు కూడా వున్నవి.

శ్రీమతి కెనెడీ ప్రధాని నెహ్రూకు కెనెడీ, తాను కలసివున్న ఒక ఫొటోను బహూకరించింది. వెండి ఫ్రేముగల ఈ ఫొటోపై ఆమె తన సంతకం చేసింది.

శ్రీమతి ఇందిరాగాంధీకి శ్రీమతి కెనెడీ స్టెర్లింగ్ మోనోగ్రామ్‌గల చిన్న డ్రెస్సింగ్ టేబుల్‌ను, శ్రీమతి ఇందిరాగాంధి కుమారులకు డ్రెస్సింగ్ పెట్టెలను బహూకరించింది.

శ్రీమతి కెనెడీ జయపూర్‌నుంచి పయనం

జయపూర్, మార్చి 20 — అమెరికా ప్రథమ మహిళ శ్రీమతి జాక్విలిన్ కెనెడీ ఉదయపూర్, జయపూర్‌లలో అయిదు రోజులు గడిపి నేటి సాయంత్రం ఇక్కడనుంచి న్యూఢిల్లీ వెళ్ళారు.

విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ శ్రీ గురుముఖ్ నిహాల్ సింగ్, ముఖ్యమంత్రి శ్రీ సుఖాడియా, జయపూర్ మహారాజా, అధికారులు ఆమెకు వీడ్కోలు చెప్పారు.

శ్రీమతి విమానాశ్రయానికి రాగానే స్కూలుపిల్లలు పాటలతో స్వాగతంచెప్పారు.

ఉదయపూర్ జయపూర్‌లలో శ్రీమతి కెనెడీ పర్యటని చిత్రాలతోకూడిన అల్బంను ముఖ్యమంత్రి శ్రీ సుఖాడియా ఆమెకు బహూకరించారు.

న్యూఢిల్లీ ఆగమనం

న్యూఢిల్లీ, మార్చి 20— ఉత్తరహిందూదేశంలో ఆరురోజులు పర్యటించి శ్రీమతి జాక్విలన్ కెనెడీ నేడు తిరిగి ఇక్కడకు వచ్చారు.

విమానాశ్రయంలో చీఫ్‌ఆఫ్ ప్రొటొకల్ శ్రీ ఎస్. కె. బెనర్జీ ఆమెకు స్వాగతం చెప్పారు.

రేపు శ్రీమతి కెనెడీ ఇక్కడనుంచి లాహోర్ వెడతారు.

బస్సు ప్రమాదంలో 21 మందికి గాయాలు

బరైల్లీ : మార్చి 20—నిన్న ఒక ప్రయాణీకులబస్సు మహేశపూర్ తాలూకాలో సమీపంలో ఒకచెట్టును ఢీకొన్న ఫలితంగా 21 మంది ప్రయాణీకులకు గాయాలు తగిలినవి.

వారిలో అరుగురికి చాలా తీవ్రంగా దెబ్బలు తగిలినవి.

ప్రమాదం జరిగినవెంటనే బస్సుడ్రైవర్ పరారీ అయినట్టు తెలుస్తున్నది.

కలకత్తాలో నౌకా ఇంజనీరు శ్రీ డాన్లే దుర్మరణం

కలకత్తా, మార్చి 19—కిడ్డర్ పూర్ డ్రయిడాక్‌లో "ఎస్. ఎస్. జలకన్య" అనే నౌకకు చెందిన ప్రొపెల్లర్ మరమ్మతులను పరిశీలిస్తూ వుండగా చీఫ్ ఇంజనీర్ శ్రీ ఎం. జి. డాన్లే దాదాపు 50 అడుగుల ఎత్తునుంచి కాలుజారి కిందపడగా తీవ్రమైన గాయాలు తగిలాయి.

ఆయనను వెంటనే సుభలాల్‌కర్మాని ఆసుపత్రిలో చేర్చారు. కాని ఆసుపత్రిలో చేర్చిన వెంటనే ఆయన మరణించారు.

సోషలిస్టు సమాజ స్థాపన

ఇండియా లక్ష్యమని కయిరో సభలో శ్రీ శ్రీమన్నారాయణ్ ఉద్ఘాటన

కయిరో, మార్చి 20—

ఆసియా, ఆఫ్రికా గ్రామీణ పునర్నిర్మాణం రెండవ మహాసభ సమావేశంలో ఇండియా ప్రతినిధివర్గం నాయకుడు, ప్లానింగ్ కమిషన్ సభ్యుడు శ్రీ శ్రీమన్నారాయణ్ నేడు మాట్లాడుతూ తమ దేశం ప్రజాస్వామ్య వ్యవస్థలో సోషలిస్టు సమాజాన్ని నిర్మించడానికి కృత నిశ్చయంతో వున్నదని ఉద్ఘాటించారు.

ప్రజల పూర్తి సహకారంతో ప్రజాస్వామ్య సంస్థలద్వారా ఎక్కువ ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చునని తాము ఆశిస్తున్నామని ఆయన ఉద్ఘాటించారు.

ప్రణాళికాబద్ధమైన ఆర్థిక కార్యక్రమంలో ఇండియా ప్రజలను భాగస్వాములుగా చేయనిదే క్రమబద్ధంగా ముందుకు సాగడం సాధ్యంకాదని శ్రీ శ్రీమన్నారాయణ్ అన్నారు.

"వ్యవసాయ రంగం, చిన్న మధ్యరకం పరిశ్రమలు ఒకేసారి అభివృద్ధి చెందడానికి వీలైన వ్యవసాయ-పారిశ్రామిక ఆర్థిక వ్యవస్థను ఏర్పాటుచేయాలని మేము కోరుతున్నాము.

"దేశం జనాభా పెరుగుతుండంవల్ల కేంద్రీకృతమైన ఆర్థిక వ్యవస్థద్వారా మా ప్రజలందరికీ లాభదాయకమైన ఉద్యోగాలను కల్పించవలసివుంది." అని ఆయన ఉద్ఘాటించారు.

ఇండియా మూడవ ప్రణాళికలలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలనుగురించి ఆయన ప్రతినిధులకు తెలియజేశారు.

విదేశీ సంస్థలతో ప్రభుత్వం ఒప్పందాలు

సభకు వెల్లడించే విషయమై లోకసభలో చర్చ

న్యూఢిల్లీ, మార్చి 20—ఒక విదేశీ సంస్థతో ప్రభుత్వం చేసుకొన్న ఒప్పందం వివరాలను సభకు తెలియజేయకుండా వుంచవచ్చునా? అనే ప్రశ్న నేడు లోకసభ చర్చలో ప్రముఖ స్థానం పొందినది.

పెట్రోల్ సంస్థలతో ప్రభుత్వం చేసుకొన్న ఒడంబడికకు సంబంధించిన వివరాలను వెల్లడించరాదని పెట్రోల్, గనుల శాఖా మంత్రి శ్రీ కె. డి. మాలవీయ లోకసభలో చెప్పగా ఈ సమస్య ఉత్పన్నమైనది.

ఈ విషయమై మంత్రితో చర్చించేవరకు స్పీకర్ తన యాలింగును వాయిదా వేసుకొన్నారు.

అటువంటి ఒడంబడికను సభలో వెల్లడించవలెనని సభ్యులు కోరగా, దానిని రహస్యంగా వుంచడానికి ప్రయత్నించినప్పుడు ఆ సమస్యను గురించి తాను పరిశీలిస్తానని స్పీకర్ చెప్పారు.

వివిధ పెట్రోల్ సంస్థలతో ఒడంబడికలు కుదుర్చుకొనడానికి ప్రభుత్వం సంప్రదింపులు జరిపిందని, వాటిలో ఇంగ్లండు, ఇటలీలకు చెందిన సంస్థలతో ఒప్పందం కుదిరిందని మంత్రి చెప్పారు. ఇంకా కొన్ని కంపెనీల విషయంలో సంప్రదింపులు జరుగుతున్నవని కూడా ఆయన అన్నారు.

అనేక కంపెనీలతో సంప్రదింపులు జరుగుతుండగా సంప్రదింపుల వివరాలు తెలియజేయాలనడం సముచితం కాదని కూడా ఆయన అన్నారు.

విదేశీ సంస్థల అభీష్టాన్ని అనుసరించి సభా హక్కులకు పరిమితి విధించడం సముచితమేనా అని సభ్యుడు ప్రశ్నించగా బహూశా ఒక ఒప్పందానికి, మరొక ఒప్పందానికి సంబంధం వుంటుందని అందువల్ల అది కష్టమని స్పీకర్ చెప్పారు. ఒక ఒప్పందానికి, మరొక ఒప్పందానికి సంబంధం లేకపోతే దానిని సభ ముందు వుంచవలెనని స్పీకర్ చెప్పారు. అయితే ఈ విషయంలో తాను మంత్రిని బలపంతం చేయనని స్పీకర్ చెప్పారు.

ఈ సమస్యను గురించి తాను స్పీకర్‌లో చర్చిస్తామని మంత్రి మాలవీయ తెలియజేశాడు.

రష్యాపై కాంగ్రెస్ నిందా ప్రచారం చేసినదట

రాజ్యసభలో భూపేష్‌గుప్తా ఆరోపణ

న్యూఢిల్లీ, మార్చి 20— గత ఎన్నికలలో కాంగ్రెస్ వారు సోవియెట్ యూనియన్‌ను గురించి, సోవియెట్ నాయకుల గురించి నిందాపూరిత ప్రచారాన్ని చేశారని కమ్యూనిస్టు నాయకుడు శ్రీ భూపేష్‌గుప్తా నేడు రాజ్యసభలో ఆరోపించారు.

దానిపై ప్రధాని నెహ్రూ మాట్లాడుతూ ఆ విషయం తన కేమీ తెలియదని, అయినా మొన్నటి ఎన్నికలలో జరిగిన పార్టీలఅసత్య ప్రచారాలను గురించి వివరించాలంటే కనీసం సంవత్సరాలు కాకపోయినా నెలలైనా పట్టవచ్చునని అన్నారు.

న్యూస్‌ప్రింట్ లైసెన్సింగ్ విధానం

వికేంద్రీకరించాలని మొదలియార్ కమిటి సిఫారసు

న్యూఢిల్లీ, మార్చి 20—ముద్రణ పరిశ్రమకు అవసరమైన న్యూస్‌ప్రింట్ మొదలైన వస్తువుల లైసెన్సింగ్ విధానాన్ని వికేంద్రీకరించాలని రామస్వామి మొదలియార్ కమిటి సిఫారసు చేసింది.

ప్రస్తుతం న్యూస్‌ప్రింట్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసిన ప్రతి అర్జీదారునిలోను రాజధానిలోని వార్తాపత్రికల రిజిస్ట్రారు మాత్రమే సంప్రతింపులు జరుపుతున్నారు.

న్యూస్ ప్రింట్‌కు సంబంధించి సంతవరకు లైసెన్సును ఇవ్వడం చాలా సాధారణ విషయమని, ప్రతి విషయంలోను వార్తాపత్రికల రిజిస్ట్రార్‌లో సంప్రతించ నవసరం లేదని మొదలియార్ కమిటీ అభిప్రాయపడింది.

"పంచాయతీ రాజ్య పథకం బలిష్టం"

మంత్రి శ్రీ యం. చెన్నారెడ్డి వివరణ

రాజమండ్రి, మార్చి 20—ఆంధ్రప్రదేశ్, ప్రణాళికామంత్రి శ్రీ యం. చెన్నారెడ్డిగారు ఈ నెల 16 వ తేదీన అన్నవరంలో శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించి హైదరాబాదు వెళుతూ సాయంకాలం ఇక్కడకు చేరారు.

"మన రాష్ట్రంలో పంచాయతీ రాజ్య పాలనలో ఏవైనా విప్లవాత్మకమైన మార్పులు తేనున్నారా?" అని విలేకరులు అడుగగా శ్రీ చెన్నారెడ్డిగారు "తానింకా పరిస్థితులను బాగా అవగాహన చేసుకోలేదని, ఏమైనా ప్రస్తుతం కన్నా తీవ్రంగానే కార్యక్రమాలు అమలు జరిగేటట్టు, ప్రజాస్వామ్య తలపెట్టిన కార్యక్రమాల వలన ఎక్కువ మంది ప్రయోజనం పొందేటట్టు చూడగలనని" అన్నారు.

శ్రీయుతులు ఎ. బి. నాగేశ్వరరావు, బత్తిన సుబ్బారావు, ప్రియంవదరావు, ఆకుల సుబ్బారావుగార్లు, పలువురు అధికార అనధికార ప్రముఖులు మంత్రిని కలుసుకున్నారు.

అన్నవరంలో మంత్రి శ్రీ యం. చెన్నారెడ్డిగారికి దేవస్థానం మేనేజరు శ్రీ ఆర్. సి. వెంకటరావు ఆలయ లాంఛనాలతో స్వాగతం పలికారు.

శ్రీ పంతం పద్మనాభం

రంగంపేట, వడిశలేరు గ్రామాలలో ఘనసన్మానాలు

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

రాజానగరం, మార్చి 20—తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం నియోజకవర్గంనుంచి, ఆంధ్రప్రదేశ్ శాసనసభకు కాంగ్రెసు అభ్యర్థిగా పోటీచేసి 25 వేల ఓట్ల మెజారిటితో అఖండ విజయాన్ని సాధించిన శ్రీ పంతం పద్మనాభం గారికి మార్చి 15 వ తేదీన రంగంపేటలో పంచాయతీ బోర్డు ఉపాధ్యక్షులు, ఆంధ్ర విజ్ఞాన సమితి కార్యదర్శి శ్రీ గారపాటి వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యాన ఘనసన్మానం జరిగింది.

ఈ సందర్భంగా నాటి సాయంత్రం, రంగంపేట పురప్రముఖులు శ్రీ అడుసుమిల్లి వెంకటనుబ్బారావు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది.

రంగంపేట పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ ఉండవిల్లి వీరవెంకట లక్ష్మీపతిరావు సభను ప్రారంభిస్తూ ప్రజాస్వామిక సిద్ధాంతాలపై ప్రగాఢ విశ్వాసం వుంచి- ఈ నియోజకవర్గం అభివృద్ధికి, శాసనసభ్యుడుగా శ్రీ పంతం పద్మనాభంగారు అరుదుపాయమైన సేవ చేస్తారన్న నమ్మకం తమ కున్నదన్నారు. ప్రజలు-శాసనసభ్యుడు పరస్పరం కలుసుకొంటూ వుండడం చాలా అవసరమని అన్నారు.

శ్రీ నెల్లిపూడి సోమలింగం, శ్రీ పంతం పద్మనాభంగారి గుణగణాలను ప్రశంసించారు.

రాజానగరం ఆంధ్ర విజ్ఞానసమితి కార్యదర్శి శ్రీ హితార్థి ఉపన్యసిస్తూ ఎన్నికలలో గెలిపించినంత మాత్రాన ప్రజల బాధ్యత, గెలిచినంత మాత్రాన శాసనసభ్యుని బాధ్యత తీరిపోలేదని, ఏ నియోజకవర్గం అభివృద్ధి అయినా శాసనసభ్యుని- ప్రజల పరస్పర సహకారంమీదనే ఆధారపడి వుందని తెలియజేశారు.

రంగంపేట ఆంధ్ర విజ్ఞాన సమితి అధ్యక్షులు, రంగంపేట - చిక్కవోలు పంపింగ్ స్కీము ఏరియా రైతు సంఘాధ్యక్షులు శ్రీ ఉండవిల్లి శ్రీహరిరావు, శ్రీ పద్మనాభంగారికి ఒక విజ్ఞాపన పత్రాన్ని సమర్పిస్తూ ఈ పంపింగ్ స్కీము వెంటనే అమలు జరిగేటట్టు చూడవలసినదిగా కోరారు.

తరువాత శ్రీ పద్మనాభం తనకు చేసిన ఘనసన్మానానికి కృతజ్ఞతను తెలియజేస్తూ, ప్రజలు ఇప్పటివరకే ఇకముందు కూడా పూర్తిగా సహకరించి, ఒక్కటి పంపింగ్ స్కీము సాధనకోసం మొత్తం నియోజకవర్గం అభివృద్ధికే భాగస్వాములు కావాలని అభ్యర్థించారు.

సభాప్రారంభంలో శ్రీ గారపాటి వీరవెంకట సత్యనారాయణగారు సభికులకు స్వాగతంచెప్పి-శాసనసభ్యులు శ్రీ పద్మనాభంగారికి అభినందన పద్యాలను సమర్పించారు.

అంతకు ముందు శ్రీ పద్మనాభంగారి గౌరవార్థం శ్రీ వీరవెంకట సత్యనారాయణగారు తమ స్వగృహంలో విందు చేశారు.

శ్రీ పంతం పద్మనాభంగారిని వడిశలేరు గ్రామస్థులు పంచాయతీ బోర్డు అధ్యక్షులు శ్రీ ఉప్పలపాటి బ్రహ్మంచౌదరి, కార్మికోద్యురయ సంఘాధ్యక్షులు శ్రీ ఉప్పలపాటి వెంకట్రాజుచౌదరి, చేనేత సహకార సంఘాధ్యక్షులు శ్రీ నీలం వెంకటరత్నంగార్ల నాయకత్వాన, పురవీధులలో బ్రహ్మాండంగా మహోత్సాహంతో ఊరేగించి, ఘన సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో రంగంపేట పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ ఉండవిల్లి వీరవెంకటలక్ష్మీపతిరావు, రంగంపేట పురప్రముఖులు శ్రీ అడుసుమిల్లి వెంకటనుబ్బారావు ప్రభృతులు పాల్గొన్నారు.

భావసార్ క్షత్రియ ప్రముఖుని కాలధర్మం

విజయవాడ, మార్చి 21—విజయవాడ శ్రీ భావసార్ క్షత్రియ మండలి మాజీ ప్రెసిడెంట్ శ్రీ గుజ్జరు బాలాజీరావు ఈ నెల 18 వ తేదీన స్వర్గస్థులైనారు. ఈ వార్త తెలియగానే విజయవాడ శ్రీ భావసార్ క్షత్రియ మండలి వారు అత్యవసర సమావేశమై అయిదు నిమిషాలు మౌనంతో వారి ఆత్మకు శాంతి కలుగుటకు దేవుని ప్రార్థిస్తూ వారి కుటుంబానికి మండలి తరపున సంతాపం తెలియపర్చినట్లు మండలి జాయింట్ సెక్రటరీ శ్రీ బందుచాడె శంభాజీరావు ప్రకటించారు.

ధరవరలు

మద్రాసు బులియన్ మార్కెట్

మద్రాసు, మార్చి 21—

సవరన్	98-50
బంగారం రెడి	125-20
ఫార్వర్డ్	123-25
వెండి నూరు తులాలు	222-00
వెండి తులం	2-25

కలకత్తా బులియన్ మార్కెట్

కలకత్తా, మార్చి 21—

వెండి రెడి	215-81
వెండి ఫార్వర్డ్	213-51
సవరన్	99-00

బొంబాయి బులియన్ మార్కెట్

బొంబాయి, మార్చి 21—

బంగారం రెడి	122-55
ఫార్వర్డ్	122-70
వెండి రెడి	218-30
ఫార్వర్డ్	217-20
సవరన్	87-00

బొంబాయి మార్కెట్

బొంబాయి, మార్చి 21—

అముదం	154-30
వేరుశనగ	232-25
ఆవిత్తనాలు	85-25
పత్తిగింజలు	105-75

విజయవాడ బులియన్ మార్కెట్

విజయవాడ, మార్చి 21—

బంగారం పాట్లా (10 గ్రాములు)	124-00
,, మూసా	124-50
సవరన్	101-00
వెండి 1 కి॥ గ్రా॥	220-00
,, 10 గ్రా॥	2-20

కొబ్బరికాయ ధరలు

విజయవాడ, మార్చి 21—

కొత్తవి వెయ్యి	180-00
వండువి ,,	215-00

అంబాజీపేట కురిడీకాయ ధరలు

అంబాజీపేట, మార్చి 21—

గండేరా (1000 కి)	రు. 280-00
గండేరా చిన్నకాయ	రు. 225-00
గటుగటా ,,	రు. 275-00

అమలాపురం కొబ్బరికాయ ధరలు

అమలాపురం, మార్చి 21—

కొత్తవి వెయ్యి	155-00
వండువి ,,	165-00

పసుపు ధర

విజయవాడ, మార్చి 21—

పాతది పుట్టి 1 కి ,,	235-00
కొత్తది ,, ,,	240-00

విజయవాడ ధాన్యం ధరలు

విజయవాడ, మార్చి 21—

(76 కి॥ గ్రాం) పాతవి, కొత్తవి

ఎస్. కె. కె. ధాన్యం ,,	34-00	31-00
అక్కుళ్ళు ,, ,,	31-00	28-25
కిచిడి ,, ,,	28-00	23-00
వంకసన్నాలు ,,	34-00	31-00

విజయవాడ బియ్యం ధరలు

(100 కి॥ గ్రాం)

అక్కుళ్ళు బియ్యం ,,	62-00	57-00
సన్నాలు ,,	70-00	81-50
ఎస్. కె. కె. ,,	70-00	61-50
వచ్చిబియ్యం మూకలు ,,	42-00	45-00

వేరుశనగ ధరలు

వేరుశనగ పిండి (70 కి॥ గ్రా)	23-50
వేరుశనగ మూకె (10 కి॥ గ్రా)	18-00
వేరుశనగ పప్పు (80 కి॥ గ్రా)	61-00

గోతాముల ధరలు

విజయవాడ, మార్చి 21—

గోతాములు 100 కి: డి.డబ్ల్యు.	122-50
ఫార్వర్డ్ మార్చి	112-00
వారసంయుక్త 10 కి:	101-50



ఆంధ్ర అసెంబ్లీ కొత్త సభ్యులచే తాత్కాలిక స్పీకర్ ప్రమాణం చేయిస్తున్న దృశ్యం

శ్రీ అలపాటికి గుంటూరులో సన్మానం

పట్టణ పారిశుధ్యంపై శ్రద్ధ వహించాలని మంత్రికి వినతి

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

గుంటూరు, మార్చి 21— మునిసిపాలిటీల, గృహ నిర్మాణమంత్రి శ్రీ అలపాటి వెంకట్రామయ్యగారికి ఈ పట్టణంలో ఈ నెల 17 వ తేదీన సాయంత్రం అఖండ సన్మానం జరిగింది.

25 జతల యెద్దులను పూన్చిన శకటంపై పెద్ద ఊరేగింపు జరిపారు. కొరిటిపాడులో గొప్ప బహిరంగసభ జరిగింది. అనేక సంఘాల తరపున సన్మానపత్రాలు సమర్పించారు.

పురప్రముఖులతో కూడిన ఒక ఆహ్వాన సంఘం గుంటూరు మెడికల్ కాలేజి ఆవరణంలో అల్పాహారవిందు చేశారు. గుంటూరు వెయ్యి మందికిపైగా అతిథులు హాజరైనారు. అల్పాహార విందు అనంతరం డాక్టరు జగన్నాథరెడ్డిగారి అధ్యక్షతన సమావేశం జరిగింది. శ్రీయుతులు చావలి సూర్యనారాయణ, మేడూరి నాగేశ్వరరావు, చేకూరి గంగిరెడ్డి, యంగిశెట్టి తిమ్మపతయ్యగార్లు శ్రీ వెంకట్రామయ్యగారు దేశసేవలో గత మూడు దశాబ్దములనుంచి చేసిన సేవను కొనియాడుతూ ఇట్టి పదవి వారికి యెన్నడో లభించి వుండవలసిందని చెప్పారు. శ్రీ వెంకట్రామయ్యగారు గుంటూరు పురప్రముఖులు తనకుచేసిన సన్మానానికి, ఆదరణకు కృతజ్ఞత తెల్పారు.

అధ్యక్షత వహించిన డాక్టర్ జగన్నాథ రెడ్డిగారు తమ ప్రసంగంలో గుంటూరు ఆంధ్రదేశంలో ప్రముఖ పట్టణమని చైర్మనేజి స్కీము చేసినందున కలా విహీన మగుటమే గాక, అనారోగ్య భూయిష్ఠమయినదని, అందుచేత మంత్రిగారు వెంటనే త్రయనేజి స్కీమును అమలులోనికి తేవలసిందని పట్టణంయధ్య వున్న ముకిరిపేటలను తొలగించి కార్మికులకు చక్కని కాలనీలను నిర్మించవలసిన దాయిత ప్రభుత్వానికి వుందని కూడా హెచ్చరించారు.

తర్వాత పట్టాభిపురంలోని రామ సత్యనారాయణస్వామి దేవాలయాన్ని సందర్శించి, జార్జిపేటలో సన్మానం అందుకొని, విద్యార్థుల ప్రదర్శనాన్ని తిలకించి, రాత్రికి విందారగించి మంత్రిగారు నేరుగా గుంటూరునుంచి కారులో హైదరాబాదు వెళ్ళారు.

ఎయిర్ వైస్ మార్షల్ శ్రీ అర్జునసింగ్ మార్చి 19 వ తేదీన పాలంపుర విమానదళం కేంద్రంలో వైమానిక సాంకేతిక నిపుణులు జరిపిన కవాతు సందర్శించారని మద్రాసు వార్త.

న్యూయార్క్ కాటన్

న్యూయార్క్, మార్చి 20—

ఓపెనింగ్	34.53
క్లోజింగ్	34.70

నెల్లూరు పాలిటెక్నిక్ ఇంజనీరింగ్ విద్యార్థిసంఘ ద్వితీయ వార్షికోత్సవ సందర్భంలో తీయబడిన ఫొటో. ఉపన్యాసకులు (అధ్యక్షుడు) శ్రీ ఎస్. పి. ఆర్. విఠల్‌రావు. ప్రక్కనున్నవారు శ్రీ సి. బి. గుప్త (ప్రిన్సిపాల్), శ్రీ గుమ్మడి వెంకటేశ్వరరావు (సినీనటుడు)

హైదరాబాద్ వద్ద సింథెటిక్ ఔషధాల ఫ్యాక్టరీ

వచ్చే ఏడాదిలో ఉత్పత్తి ప్రారంభం

హైదరాబాద్, మార్చి 21—ఇక్కడకు ఏడుమైళ్ళ దూరంలో గల కోకపల్లి వద్ద రష్యా సహాయంతో సింథెటిక్ ఔషధాల ఫ్యాక్టరీని నిర్మిస్తున్నారు.

ఈ ఫ్యాక్టరీ 1964 సంవత్సరారంభంలో పని ప్రారంభించే నిమిత్తం, తగిన ఏర్పాట్లు త్వరితంగా కొనసాగుతున్నవని తెలియవచ్చింది.

ఈ ఫ్యాక్టరీ నిర్మాణ వ్యయం 19 నుంచి 20 కోట్ల రూపాయల వరకు కాగలదు. సుమారు 900 ఎకరాల స్థలంలో దీనిని నిర్మిస్తున్నారు. ఫ్యాక్టరీ సమీపంలో ఒక ప్రత్యేక నగరం కూడా నిర్మింప బడుతుంది.

సల్ఫా గ్రూపుకు చెందిన ఆధునిక ఔషధాలు, శీఘ్రవ్యాధి నివారిణి ఔషధాలు, తడితడి విటమిన్లు మొత్తం ఏటా సుమారు 850 టన్నుల ఔషధాలు ఉత్పత్తి కాగలవట. సల్ఫాడిమైడ్ పౌడియలు, సల్ఫానిలే మొదలైన మధ్యరకం ఔషధాలు ఏటా సుమారు 1,500 టన్నులు ఉత్పత్తి కాగలవని తెలుస్తున్నది.

ఈ ఫ్యాక్టరీని అత్యాధునికమైన యంత్రపరికరాలతో నిర్మిస్తున్నారు.

సుమారు 8000 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించగల ఈ ఫ్యాక్టరీలో 350 నుంచి 400 మంది వరకు ఇంజనీర్లు ఇతర సాంకేతిక నిపుణులు ఉంటారు.

ఈ ఫ్యాక్టరీకి గల మార్చి 30 తేదీన కేంద్ర రెవిన్యూ మంత్రి శ్రీ కె. సి. రెడ్డి శంకుస్థాపన చేశారు.

లోలిసారిగా సోవియట్ ఇంజనీర్లకు, సాంకేతిక నిపుణులకు, 250 వసతి గృహాల నిర్మాణం ప్రారంభించారు.

అనంతరం మొత్తం 3000 వసతి గృహాలను నిర్మించడానికి పూనుకున్నారు.

ఫ్యాక్టరీ నిర్వహణాధికారి శ్రీ కె. వి. శ్రీనివాసన్ ఈనెల 19 వ తేదీన పత్రికల వారితో మాట్లాడుతూ ఒక్క ఫ్యాక్టరీ నిర్మాణానికి కావలసిన స్థలం అరవై ఎకరాలని; మొత్తం ఎనిమిది బ్లాకులుగా నిర్మిం చబడుతుందని తెలియజేశారు.

ఔషధ పరిశోధన సంస్థ

ఈ ఫ్యాక్టరీలో ఔషధాలను తయారు చేయడానికి, దిగుమతి చేసిన ముడిసరుకును పరిశోధించే నిమిత్తం, తయారు చేయబడిన ఔషధాల నాణ్యాన్ని పరిశీలించే నిమిత్తం కేంద్ర పరిశోధనసంస్థ, లేబరేటరీలు నిర్మించబడతాయని శ్రీ కె. వి. శ్రీనివాసన్ తెలియజేశారు.

పరిశోధన సంస్థలో ఔషధాల తయారీకి సంబంధించిన పరిశోధనలు, కొత్త ఔషధాలను కనుగొనడం వంటి కార్యక్రమాలు కూడా జరుగగలవని ఆయన వెల్లడించారు.

ఈ ఫ్యాక్టరీకి రోజుకు 12,000 నుంచి 15,000 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి, సుమారు 25 లక్షల గ్యాలన్ల నీరు అవసరమని తెలియజేశారు.

ఫ్యాక్టరీ ప్రక్కన నిర్మించబడుతున్న ప్రత్యేక పట్టణానికికాక, ఒక్క ఫ్యాక్టరీ నిర్మాణానికే 20 వేల టన్నుల సిమెంటు ఆరువేల టన్నుల ఉక్కు, 1,600 టన్నుల ఇనుప గొట్టాలు, కోటికిపైగా ఇటుకలు కావలసి ఉంటవని ఆయన వెల్లడించారు.

షార్ట్ సర్టిఫికేట్ కోర్సులో ప్రవేశం

ప్రాథమిక పరీక్ష ఫలితాలు

హైదరాబాద్, మార్చి 21— 1962 జనవరిలో షార్ట్ సర్టిఫికేట్ కోర్సులో ప్రవేశానికి నిర్వహించిన ప్రాథమిక పరీక్షలో దిగువ రిజిస్టర్ నెంబర్లు గల అభ్యర్థులు ఉత్తీర్ణులైనారు:

తెలుగు

1 19 20 21 23 24 26 27 28 58 59 60 62 63 64 68 132 33 34 37 38 40 41 42 45 47 48 50 51 213 16 17 19 20 80 81 82 83 85 87 88

69 70 71 72 73 78 355 57 58 60 61 64 66 407 11 38 39 76.

సంస్కృతం

38 82 83 164 297 298.

ఉర్దూ

165 564 506

మాథమాటిక్స్

48 88 89 90 94 169 72 82 232 36 301 05 07 08 09 10 11 12 13 19 74 77 85 86 449 50 54.

సోషల్ స్టడీస్

18 53 138 353 400 02 65 66 67 92 93 94 95 517.

హిందీ

29 36 159 228 96 417 18 44 97 98 99 500 02.

ఫిజికల్ సైన్సు

48 109 10 96 97 244 47 48 48 329 30 36 95 458 86 87.

నాచురల్ సైన్స్

121 252 345 99 464.

సుప్రీం కోర్టుకు వేసవి శలవులు

న్యూఢిల్లీ, మార్చి 20—వేసవి శలవుల కారణంగా సుప్రీంకోర్టు 1962 మేనెల ఏడవతేదీనుంచి జూలై 15 వ తేదీ వరకు మూసివేయబడుతుందని కోర్టు విడుదలచేసిన ప్రకటన తెలుపుతున్నది.

ఈ శలవు సమయంలో అత్యవసరమైన కార్యకలాపాలను చూసే నిమిత్తం జస్టిస్, రమణరెడ్డియార్, జస్టిస్ జె. ఆర్. ముధోల్కర్‌లు నియమించబడినట్టు కూడా ఈ ప్రకటన తెలియజేసింది.

మహాకవి గురజాడ

(3 వ పేజీ తరువాయి)

ఆ విశేషాన్నంతటిని అరటిపండు వలిచి చేతికిచ్చినట్లు ఈ క్రింది తరణాలలో వివరించారు గురజాడ.

"ప్రేమ నిచ్చిన ప్రేమ వచ్చును
ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును."

వివిధ జాతుల, కులాలలో నిర్మితమైన సమాజాన్ని గురజాడ గర్హించినంతగా, ఈ ఆధునిక యుగంలో ముఖ్యంగా ఇంతకు ముందెన్నడూ జరగలేదనే చెప్పాలి. మానవులుగా జన్మించడమే ఒక వరమని, మానవజాతి మహత్తరమైనదని ఆయన నమ్మినట్టుగా మరొకరు భావించలేదు. ఇంతటి మహత్తర జాతిలో పేరు పుట్టుగుల్లా ఈ కులాలు, జాతు లుండడం జాతి విజాతికి నికేనని ఆయన వ్యథచెందినంతగా మరొకరు బాధ పడలేదు.

చాంద సాభిప్రాయాలతో, అంధవిశ్వాసాలతో మతకావేషాలను, వర్ణవైషమ్యాలను పెంచుకుంటూ, మానవజాతి ఉనికినే మరుగు తెస్తున్న తరుణంలో గురజాడ అవతరించి మంట కలసి పోతున్న మానవ జాతిని ఆదుకున్నారు. పట్టాలు పొందా సాధించలేని పనులను తన రచనల ద్వారా సాధించి సమాజానికి ధన్యుడైనాడు గురజాడ.

మతాలు, కులాలు కేవలం కల్లలని, అందుచేత వాటికి అతీతంగా వుంటూ మానవ జన్మను సార్థకం చేసుకోవలసిందిగా ప్రబోధించారు. అలా మానవాళి తమ ధర్మాన్ని పాటించినప్పుడు

"మెల్లలోకము వాక్కు బుల్లె,
వర్ణ భేదములెల్ల కల్లె,
వేల నెరుగని ప్రేమబంధము
వేడుకల మరియ"

ఉమే కాకుండా;

"మతములన్నియు మాసిపోవును,
జ్ఞాన మొక్కటి నిలిచి వెలుగును;
అంత స్వర్గ సుఖంబు లన్నవి
యవని విలసిల్లున్"

అంటూ భవిష్యత్తును కళ్ళకు కట్టినట్టు చూపించారు.

మనదేశంలో పున్నగ్గి మతాలు, కులాలు, దేవుళ్లు ప్రపంచంలో మరే దేశంలోనూ లేవు. మతాల, కులాల పేరిట స్వార్థపరులు కల్పించిన నియమాలు, కట్టుబాట్ల ఫలితంగా దేశ ప్రజల అభివృద్ధికి అవరోధం ఏర్పడింది. అంతటితో ఆగక మత కక్షలు, కుల కక్షలు పర్యవసించి ఆధిక్యత కలిగివున్న వర్గాలవి పైచేయి అవుతూ ప్రజలలో అనైక్యత ప్రబలిపోయింది. సుఖశాంతులు కరువయ్యాయి. అవకాశవాదులు మతం పేరున, కులంపేరున తీర్చుకుంటున్న అవసరాలు మన అనుభవాలలో కోకొల్లలు. ఈ మత కుంచికాలను మూఢవిశ్వాసాలను తీవ్రంగా నిరసిస్తూ, సమాజంలో పేరుకు పోయిన కుళ్ళు సంతటిని బయటపెట్టారు గురజాడ మత అజ్ఞానం పై విప్లవం చేపడితారు. మానవులు మతాల పేరిట కల్పించిన విలువలు కేవలం "పొల్లు" మాత్రమే నంటూ తన రచనల ద్వారా నిరూపించారు. [illegible] సౌభ్రాతృత్వాన్ని ప్రబోధిస్తూ గురజాడ [illegible] కలం నుంచి ఆవిర్భవించిన అజరామరమైన "మీ పేరేమిటి?" అనే కథానికే చిందరు నిదర్శనం.

"అంతరాంతరమ"మనే మరొక జాత్యంతరాటికి, నేటికీ మన సమాజంలో దాగా ప్రబలి వుంది. ఈనాడు అంతరాంతరాన్ని బహిర్గతంగా మన రాజ్యాంగం ప్రకటించింది. ఈ కుల వ్యవస్థను నిర్మూలించడానికి మహాత్మాగాంధీ తన జీవితాన్నే ధారపోశాడు. కాని, మహాకవి గురజాడ ఈ ఉద్యమానికి తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ఈ కలాద్వారం భుంలోనే అంకురార్పణ చేశాడు. సమాజంలో అధిక్యతగల మనుషులు తమ ప్రాబల్యాన్ని పెంపొందించు కుంటూ, నిరంకుశత్వ ధోరణిలో, అహంకారంతో విన్నకులాలవారి జీవితాలను బలిగొంటూండడం గురజాడకు మనస్తాపాన్ని కలిగించింది. "బలీవతను వధ చెయ్యబోవారు, కులవధ చూడరు. కుల చేదకులు ఇవనిరావు" అంటూ హెచ్చరించారు. అంతటితో ఆగక సమాజంలో క్రింది స్థాయిలోనున్న మనుషులను పైకి తీసుకురావడానికి నడుం బిగించారు.

మానవులందరూ ఒకే జాతివారు, మనుష్యులందరిలోనూ రక్తమాంసాలు ఒకే రంగులో వున్నాయి. వృత్తి ధర్మాన్ననుసరించి కులాలను కల్పించి పాటి మానవులను వేరుపరచడం తగదు—

"మలిన వృత్తులు మాలవారని
కులము వేర్చిన బలియురాక దే
శమున కొందరి దెలికి దోసిం
మలినమే మాల."

అని "మాల"ను నిర్వచించారు.

"ధర్మం"పేరిట జరుగుతున్న ఈ అత్యాచారాన్ని, అన్యాయాన్ని ఖండిస్తూ -

"మలినదేహులు మాలలనుచును,
మలినచిత్తుల కతిక కులముల
నెలకొనంగిన వర్ణ ధర్మము
ధర్మ ధ్వంసంబే"

అంటూ అగ్రకులాల నేటి నియమాలను, వారు రూపొందించిన ధర్మ సూత్రాలను నిరసించి నిర్మూలించారు. అంతటితో ఆగక చెబుతున్న, లోకంలో రెండే కులాలంటే, అవి "మంచి", "చెడు", అనే కులాలని చెబుతూ వ్యక్తిని వ్యక్తీకరిస్తూ -

"మంచి చెడ్డలు మనుజులందును
ఎంచిచూడగ రెండె కులములు
మంచియన్నది మాలయైతే
మాలనే అగుదున్"

అంటూ తన 'ఓటు'ను 'మాల'తో ఆలంకరించారు.

ఏటికెదురీదడం కష్టంతో కూడుకున్నదని. అయినప్పటికీ మహాకవి వెనుకంజ వెయ్యలేదు. తను సత్యమని, న్యాయమని, ధర్మమని నమ్మిన [illegible] సమాజాన్ని మూఢవిశ్వాసాలను, అంధ నమ్మకాలను ఖండిస్తూనే వచ్చాడు. ప్రజలలో పరివర్తన తీసుకు రావడానికి తన కలాన్ని సాధనంగా చేసుకున్నాడు. సమాజాభ్యుదయాన్ని, సర్వ మానవ సౌభ్రాతృత్వాన్ని, జాతీయ సమైక్యతను సాధించడం కోసమై భావసమైక్యత అవసరాన్ని పదే పదే నొక్కి వక్కాణిస్తూ- తన [illegible] చెప్పిన మాటలు, ప్రా[illegible] దూరదృష్టికి నిదర్శనాలు.

ఈ మహత్తర ఆశయాలు వారి రచనలలో అనేకంగా గోచరిస్తాయి. నాడు ఆయన ప్రవచించిన ధర్మసూత్రాలు ఈ నాటి ఆచరణలో వున్నాయి. వారి మాటలలో సత్యాన్ని గుర్తించగల స్థితిని నేటి సమాజం ఆలంబనగా కన్నది. అనితరకాలంలో మహాకవి ఆశయాలు సాధ్యం పొందుతాయంటే అశ్చర్యపడనక్కర్లేదు.

మహాకవి గురజాడ అంతగా ఆలోచన పరచడానికి కారణం చేశారోలేదు. ఈ వ్యవస్థలు ఉనికి మానవజాతిలో అనైక్యతను పెంపొందించడమేకాక, దేశ భద్రతకే ముప్పు తెస్తుందని మానవజాతి మనుగడకే భంగం వాటిల్లుతుందని భీతిల్లాడు. ఈ క్లిష్ట పరిస్థితిని నాడే గుర్తించిన మహాకవి "అన్నదమ్ములవలెను జాతులు - మతములన్నీ [illegible] యం"టూ విశ్వశ్రేయం లో ఏకత్వసాధనకు పీఠం వేశాడు.

ప్రజల హృదయాలలో "మానవప్రేమ" అనే అమృతాన్ని నింపుతూ, సర్వధర్మ ప్రవర్తితులను చేసి-"మతాలు, కులాలు శవాలు మానవ కల్పితాలు. వీటికి అతీతంగా వుంటూ రోటి మానవులకు ప్రేమతత్వం పుక్కుకొనడం ద్వారా సకలసౌభాగ్యాలను పొందడమే కాక, మానవ జన్మను సార్థకం చేసుకోమని ప్రబోధించారు. నవప్రపంచానికి సంగమమైన దాటను నిర్మించి తన జన్మను సార్థకం చేసుకోవడమే కాకుండా నవయుగానికి యుగకర్తగా వెలుగొందారు.

"మతం వేరైతేను మేమోయ!
మనము రాజులై మనుజులుంటే
జాతమన్నది లేని పెరిగి
లోకమున వాడిలుదుమోయ!

"కేశమనియెడి దొడ్డ వృక్షం
ప్రేమలను పూరెత్త వరదోయ!
సుమల చెమటను తడిసి మూలం
ధనం పంటలు పండవచెనోయ!"

"ఇట్టి కొంటె బాలుని రక్షగా పోషించాలంటే, మీకు చేతనించినంత వుండాలి... అసలు అతనిని మీరు పరిశుభ్రంగానూ, భాగనుగానూ వుంచుటకు మళ్ళీ మళ్ళీ అల్లరి పడుతుంటాడు.

కానీ నేడుకాదు, సన్‌లైట్ సబ్బు కొనాలి. దాని సమృద్ధమైన మరగ అతని బట్టలను బాగా శుభ్రపరుస్తుంది.

మళ్ళీ మళ్ళీ పుట్టకుండేలా ఏర్పాటు చేయడం, శుభ్రమైన బట్టలు అవసరమైనప్పుడు

మీ దగ్గర్లోని కిరాణాకొట్టు వారికి చెప్పండి. తప్పక సన్‌లైట్ కొనండి. ఇది మీ పిల్లలకు ఆరోగ్యకరమైనది. 'అందాలబాలుని పరిశుభ్రత కొరకు సన్‌లైట్ కొనండి' అని చెప్పండి.

SUNLIGHT

సన్‌లైట్

మీ బట్టలకు వరప్రసాదం!

హిందుస్థాన్ లీవర్ లిమిటెడ్

S.31-X 32 TG

ఆకాశవాణి

శుక్రవారం, మార్చి 23

(శక 1884 చైత్ర 2)

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాతం, 6-35 భక్తి రంజని (హైదరాబాద్‌నుంచి రిలే), 7-00 తెలుగులో వార్తలు, 7-15 గాంధీమార్గం (హైదరాబాద్ నుంచి రిలే), 7-30 హైదరాబాద్ పలె, 8-00 ఆంగ్లమున వార్తలు. మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం, 1-00 శ్రీమద్ప్రభాకర కృష్ణమూర్తి శాస్త్రి, 1-30 లలిత సంగీతం, 1-50 తెలుగులో వార్తలు. సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమం: గ్రామలక్ష్మి-శ్రీలతలు; ఆకాశవీణలో జీవ - విద్యుత్సంగీతం: పి. లలితాదేవి; మీరు కోరిన పాటలు; ఉత్తరాలు-జవాబులు; రంగుల రాట్నం: పిల్లల కార్యక్రమం. 7-00 తెలుగులో వార్తలు, 7-15 గ్రామస్థుల కార్యక్రమం, 7-30 సంగీత కచేరీ (మద్రాస్ నుంచి రిలే), 9-00 ఆంగ్లమున వార్తలు, 9-15 వీణపై రాగప్రస్తారం: ఆకాశవాణి వాద్యబృందం, 9-30 నాటిక (హైదరాబాద్ నుంచి రిలే), 9-45 శ్రీమద్ప్రభాకర కృష్ణమూర్తిశాస్త్రి, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-35 భక్తి రంజని: లలిత పంచరత్నం; దేవీస్తుతి; మీనాక్షి పంచరత్నం, 7-00 తెలుగులో వార్తలు, 7-15 గాంధిమార్గం, 7-30 వి.ఎస్. అనంతరావు: వీణ. 8-00 ఆంగ్లమున వార్తలు, 8-30 హిందుస్థానీ సంగీత శిక్షణ. మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం (విజయవాడ నుంచి రిలే), 1-30 జవీల్ లతీఫ్: సితార్, 1-50 తెలుగులో వార్తలు, 2-00 హైదరాబాద్ ఎ పలె. సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 7-00 తెలుగులో వార్తలు, 7-15 గాంధీ కథ, 7-30 కర్ణాటక సంగీత కచేరి (మద్రాస్ నుంచి రిలే), 8-55 పార్లమెంటులో ఈవేళ (ఆంగ్లం - ఢిల్లీనుంచి రిలే)- 9-00 ఆంగ్లమున వార్తలు, 9-30 చదరంగం: రూపకం-రచన: సహజానంద, 9-45 గానసుధ, 10-00 సుబ్బరాయగీతి: సుశీలా నంజుండయ్య, 10-10 జవీల్ లతీఫ్: సితార్, 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాద్-బి

60.12 మీ (4990 కిలోసై)

అణ్వస్త్ర పరీక్షల నిషేధంపై తిరిగి చర్చలు ప్రారంభం

మూడు అణ్వస్త్ర రాజ్యాలలో ఉపసంఘం నియామకానికి జెనీవా సభ అంగీకారం

ఈ వారాంతం లోపుగా తమకు నివేదిక సమర్పించవలెనని 17 రాజ్యాల సభ ఆదేశం

జెనీవా, మార్చి 21—

అణ్వస్త్ర నిషేధ సమస్యపై ఉపసంఘంగా రష్యా, అమెరికా, బ్రిటన్‌లు వ్యవహరించడానికి 17 రాజ్యాల నిరాయుధీకరణ సభ నిన్న ఏకగ్రీవంగా ఆమోదించిందని కెనడా అధికార వర్గాలు తెలియజేశాయి.

ఈ ఉపసంఘం ఈ వారాంతం లోపుగా తన నివేదికను సమర్పించవలెనని కూడా నిరాయుధీకరణ సభ కోరింది.

ఈ సభ సహాధ్యక్షులయిన రష్యా, అమెరికాలు నిరాయుధీకరణ ఒప్పందానికి సంబంధించిన చర్చలపై ఒక కార్యక్రమాన్ని రూపొందించి ఇవాళ సభకు సమర్పించవలెనని నిన్న సాయంత్రం జరిగిన ఇష్టాగోష్ఠి సమావేశం సూచించింది.

ఆ విధంగానే అణ్వస్త్ర రహిత మండలాలు, శాంతి ప్రయోజనాలకు రోదసీ వినియోగం, నిర్వర్గ ఒడంబడికలు, రసాయనక ఎదార్థాల వంటి సమస్యలను చర్చించడానికి కూడా ఒక కార్యక్రమాన్ని రూపొందించవలెనని ఆ సమావేశం సూచించింది.

అణ్వస్త్ర నిషేధంపై తాము ఒక ఒడంబడికకు రాగలిగినదీ లేనిదీ కూడా తమకు తెలియచేయవలెనని ఆ మూడు రాజ్యాలను ఈ సభ కోరినట్టు అభిజ్ఞవర్గాలు తెలియజేశాయి.

నిరాయుధీకరణ ఒడంబడికపై గడచిన వారంలో రష్యా సమర్పించిన ముసాయిదాను చర్చలకు ప్రాతిపదికగా వినియోగించవలెనని ఆండ్రీ గ్రోమికో అర్థించారని, కానీ అమెరికా, రష్యాలు సమర్పించిన ముసాయిదాలకు రెండింటిని సంయుక్తంగా వినియోగించవలెనని ఇష్టాగోష్ఠి సమావేశం నిశ్చయించిందని ఆ వర్గాలు తెలియజేశాయి.

అణ్వస్త్ర పరీక్షల నిషేధంపై చర్చలు పునఃప్రారంభం

అణ్వస్త్ర పరీక్షల నిషేధంపై అమెరికా, బ్రిటన్, రష్యాలు తిరిగి నేటినుంచి చర్చలు ప్రారంభిస్తాయని నిన్న ఇక్కడ అధికార వర్గాలు వెల్లడించాయి.

ఈ సంభాషణలు 17 రాజ్యాల నిరాయుధీకరణ సభ ఏకగ్రీవంగా నిర్ణయించిన మూడు రాజ్యాల ఉపసంఘం సమావేశాలలో జరుగుతాయి.

1958 అక్టోబర్ 31 వ తేదీన ప్రారంభమైన ఈ సంభాషణలు గత జనవరి 29 వ తేదీన నిరవధికంగా వాయిదాపడినవి.

బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ ప్రకటన

అణ్వస్త్ర పరీక్షల నిషేధంపై అంతర్జాతీయ పర్యవేక్షణ సిద్ధాంతాన్ని అమోదించకుండా ఈ నిరాయుధీకరణ సమావేశంసఫలమౌతుందనితాను ఎక్కువగా ఆశించడంలేదని బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్ నిన్న కామన్స్ సభలో చెప్పారు.

ఏప్రిల్‌లో అణ్వస్త్ర పరీక్షల నిషేధంపై శిఖరాగ్రసభ జరపడానికి ఒక దృఢమైనప్రతిపాదన చేయవలసిందిగా లేబర్‌పార్టీ సభ్యుడు ఆర్థర్ హాండర్సన్ సూచించగా ఆయనపై విధంగా సమాధాన మిచ్చారు. ఈ ఒడంబడికను గురించి ప్రధాని కృశ్చేవ్‌తో శిఖరాగ్రసభ స్థాయిలో సంప్రదింపులు జరపవలసిన అవశ్యకతవుందని ఆయన అన్నారు.

అంతర్జాతీయ పర్యవేక్షణకు రష్యా అంగీకరిస్తే శిఖరాగ్రసభ జరగడం అసాధ్యమని తాను భావించనని ఆయన అన్నారు. దానికి రష్యా అంగీకరించకపోతే ఈ సంప్రదింపులు జరుగుతాయని తాను ఆశించలేనని ఆయన చెప్పారు.

జెనీవా సంభాషణల సందర్భంలో శిఖరాగ్రసభ జరగడానికిగల అవకాశాలను గురించి లార్డ్ హోంతో చర్చించారా అని గెయిట్‌స్కెల్ ప్రశ్నించగా విస్తృతావకాశాలను గురించి ఆయన తనతో చర్చించారని ప్రధాని మాక్మిలన్ సమాధాన మిచ్చారు.

బెర్లిన్ పరిస్థితి కొంత అభివృద్ధి చెందినదని ఆయన మరొక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

శ్రీ మీనన్ సూచనపై డీన్ రస్క్ వ్యాఖ్య

అంతర్జాతీయ పర్యవేక్షణకు శాస్త్రీయ సమాచారం సేకరించడానికి అవకాశం వున్నప్పుడే అణ్వస్త్ర పరీక్షల నిషేధంపై ఒడంబడిక సాధ్యమౌతుందని అమెరికా విదేశాంగ మంత్రి డీన్‌రస్క్ నిన్న జెనీవాలో ఒక ప్రకటన చేశారు.

అణ్వస్త్ర పరీక్షల పరిశోధనా కేంద్రాలను ఆలీస రాజ్యాల భూభాగంలో ఏర్పాటు చేయవలెనని శ్రీ మీనన్ చేసిన సూచనలపై ఆయన పై విధంగా అన్నారు.

అంతర్జాతీయ పర్యవేక్షణ ఎవరికీ భారం కాదని, గూఢచారి చర్యలకు దారితీయదని ఆయన అన్నారు.

బ్రెజిల్ విదేశాంగ మంత్రి విందు

బ్రెజిల్ విదేశాంగ మంత్రి శాటియాగో డాంటాస్ నిన్న భారతరక్షణ మంత్రి శ్రీ మీనన్, బ్రిటిష్ విదేశాంగ మంత్రి లార్డ్ హోం, సోవియెట్ విదేశాంగమంత్రి గ్రోమికోలకు విందు చేశారు.

లార్డు హోం, శ్రీ మీనన్‌ల రహస్య సంభాషణలు

17 రాజ్యాల నిరాయుధీకరణ సభ పరిణామాలను గురించి ఇండియా రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్, బ్రిటిష్ విదేశాంగమంత్రి లార్డ్‌హోంలు నిన్న చర్చలు జరిపారు.

శ్రీ కృష్ణమీనన్ భారత కాలమానం ప్రకారం ఇవాళ రాత్రి 9-30 గంటలకు న్యూఢిల్లీ వెడతారని అనుకొంటున్నారు. ఆయన న్యూఢిల్లీ వెళ్ళిన తర్వాత భారత ప్రతినిధివర్గానికి ఆర్థర్ లాల్ నాయకత్వం వహిస్తారు.



ఫతేపూర్ సిక్రీ కోటను దర్శిస్తున్న శ్రీమతి కెనెడీ



మైసూరు నూతన మంత్రివర్గం సభ్యులు - ఎడమనుంచి కుడికి: శ్రీయుతులు వీరేంద్ర పాటిల్, కె. మల్లప్ప, డాక్టర్ నాగప్ప ఆళ్వ, ఎస్. ఆర్. కంఠి (ముఖ్యమంత్రి), గవర్నర్ శ్రీ జయచామరాజ ఒడయార్, ఎం. వి. కృష్ణప్ప, ఆర్. ఎం. పాటిల్, ఎం. వి. రామరావ్, బి. రాచయ్య, శ్రీమతి యశోదరమ్మ దాసప్ప

నిరాయుధీకరణపై ఇండియా అభిప్రాయం

కంట్రోల్సుతో దానిని విడదీయరాదని జెనీవా సభలో శ్రీ కృష్ణమీనన్ వివరణ

జెనీవా, మార్చి 20—

ఇండియా రక్షణమంత్రి శ్రీ కృష్ణమీనన్ నేడు 17 రాజ్యాల నిరాయుధీకరణ సభలో ప్రసంగిస్తూ, నిరాయుధీకరణ, కంట్రోల్స్ అవిభాజ్యమైనవిగా తమదేశం పరిగణిస్తున్నదని ఉద్ఘాటించారు.

అమెరికా తన ప్రతిపాదనలకు వచ్చే కొద్ది రోజులలో కొత్త వివరణ జతచేయుతుందని తనకు అధికార పూర్వకంగా తెలిసిందని ఆయన ప్రకటించారు.

మొత్తం ప్రపంచ జనాభాలో అణ్వస్త్ర దేశాల జనాభా 50 కోట్లు మాత్రమేనని ఆయన అంటూ, అణ్వస్త్ర సంఘర్షణల వల్ల కలిగే దుష్ఫలితాలకు అందరూ గురి అవుతారని పేర్కొన్నారు.

యుద్ధంవల్ల ఇప్పుడు ఏదేశం తన వ్యాపారాన్నిగాని, ఆర్థిక అభివృద్ధిగాని చేసుకొనలేదని. ఎందుచేతనంటే ఇప్పుడు యుద్ధం వల్ల మిగిలేది సర్వనాశనమని శ్రీ మీనన్ ఉద్ఘాటించారు.

నిరాయుధీకరణ కార్యక్రమం త్వరితంగా అమలు జరగాలని ఇండియా ప్రభుత్వం భావిస్తున్నదని, ఆ విధంగా కాకమెల్లిగా జరిగిన పక్షంలో అనుమానాలు తలెత్తగలవని ఆయన హెచ్చరించారు.

నిరాయుధీకరణను ఒకే దఫాలో కొద్ది కాలంలో సాధించాలని ఈ మధ్య ఐక్యరాజ్య సమితిలో ఇండియా ప్రధాని నెహ్రూ చెప్పిన మాటలను ఆయన ఈ సందర్భంలో ప్రస్తావించారు.

ఆ తరువాత ఇండియా రక్షణ మంత్రి రష్యా, పశ్చిమ రాజ్యాల ప్రతిపాదనలలో నిరాయుధీకరణ, కంట్రోల్స్ విషయంలో వున్న ఏకాభిప్రాయాలను ప్రస్తావించారు.

రష్యా ముసాయిదా శాంతి ఒడంబడిక, అమెరికా కొత్త ప్రతిపాదనలనుంచి ఆయన కొన్ని ఉదాహరణ లిచ్చారు.

రెండువర్గాల ప్రతిపాదనలలో వున్న విభేదాలనుకూడా ఆయన ప్రస్తావించి, రెండు వర్గాలు సమరస వైఖరికి ప్రాముఖ్యత ఇచ్చినందుకు ఆయన తమ హర్షాన్ని ప్రకటించారు.

కార్యక్రమం అమలుకు ఆయన మూడు మార్గాలను ప్రతిపాదించారు.

అమెరికా, రష్యాలు రెండూ తమతమ పథకాలను తీసుకొని ఒక పరిష్కార మార్గాన్ని రూపొందించడం మొదటిది. ఈ విధంగా జరిగితే అట్టి చర్యను ఇండియా ప్రతినిధివర్గం హర్షిస్తుందని శ్రీ మీనన్ అన్నారు.

రెండవమార్గం పరిష్కార సాధనకు ఒక చిన్న ఉపసంఘాన్ని నియమించడం.

నిరాయుధీకరణ సభ సంయుక్తాధ్యక్షులైన అమెరికా రష్యాల ఆధ్వర్యంలో ఉపసంఘం ఏర్పడి, ఒప్పందం రూపొందించ దానికి ఒక ముసాయిదాను తయారుచేయడం మూడవ మార్గం.

జెనీవా సభ తన నివేదికను జూన్ 1 వ తేదీ నాటికి సమితి నిరాయుధీకరణ సంఘానికి అందజేయవలసి వున్నందున ఈ సమస్యపై ఒప్పందాన్ని త్వరితంగా సాధించాలని ఆయన అన్నారు.

మార్చి 15 వ తేదీన ఇండియా పార్లమెంట్‌లో ప్రధాని నెహ్రూ చేసిన ప్రసంగం నుంచి ఆయన ఎక్కువగా ఉదహరించారు.

ఆ తరువాత శ్రీ మీనన్ నిర్దిష్టమైన చర్యలను గురించి ప్రస్తావించి, సరాసరి ఒకేసారి తీసుకొనదగు చర్యలు కొన్ని వున్నాయని ఇండియా భావిస్తున్నదని ప్రకటించారు.

వీటిలో ఒకటి అణ్వస్త్రాల విస్తరణను అరికట్టడమని ఆయన అన్నారు.

అణు రహిత మండలాల ఏర్పాటు ప్రతిపాదన మరొక చర్య అని ఆయన అన్నారు ఆఫ్రికాను అణ్వస్త్ర రహిత మండలాన్ని చేయాలన్న ప్రతిపాదనను ఆయన ఈ సందర్భంలో ప్రస్తావించారు.

అణ్వస్త్రాల ఉత్పత్తికి ధనం మంజూరు చేయడాన్ని తగ్గించడం ఇట్టి విషయాలలో మరొకటని ఆయన అన్నారు.

అణ్వస్త్ర పరీక్షల నిషేధం

అణ్వస్త్ర పరీక్షల నిషేధం సమస్యను గురించి శ్రీ కృష్ణమీనన్ మాట్లాడుతూ, జెనీవా సభ జరుగుతున్న కాలంలో నైనా పరీక్షలు ప్రారంభించవద్దని నిన్న పార్లమెంట్‌లో ప్రధాని నెహ్రూ చేసిన విజ్ఞప్తిని ఉదహరించారు.

అణ్వస్త్ర పరీక్షల నిషేధం చర్చలు తిరిగి ప్రారంభించడానికి అగ్రరాజ్యాలు మూడు నిర్ణయించుకొన్నందుకు ఆయన తన హర్షాన్ని ప్రకటించారు.

ఒప్పందం కుదిరేలోపుగా అణ్వస్త్ర పరీక్షలు జరిగాయా లేదా తెలుసుకొనడానికి ఇప్పుడువున్న మార్గాలకు అనుబంధంగా అలీనరాజ్యాలలో వీటిని తెలుసుకొనే తటిపీ కేంద్రాలను నెలకొల్పాలని ఆయన సూచించాడు.

రాజ్యాంగ విరుద్ధంగా వర్ణవివక్ష

నీగ్రో నాయకుడు డాక్టర్ కింగ్ వివరణ

అట్లాంటా (జార్జియా), మార్చి 19—

వర్ణవివక్షత రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించే ఉత్తరువు ముసాయిదా నొక దానిని తాను రూపొందిస్తున్నానని, దానిని పరిశీలించడానికి ప్రెసిడెంట్ కెనెడీ అంగీకరించారని నీగ్రో నాయకుడు డాక్టర్ మార్టిన్ లూథర్ కింగ్ నిన్న ఇక్కడ ప్రకటించారు.

ప్రెసిడెంట్ కెనెడీకి సమర్పించడానికై ఈ ముసాయిదా ఒక మాసంలోగా తయారు కాగలదని డాక్టర్ కింగ్ అన్నారు. తాను ఈ ముసాయిదాను పరిశీలించడానికి అంగీకరించినపుడు, దానిపై తాను ఉత్తర్వు ఇవ్వగలరా? లేదా అన్న విషయాన్ని ప్రెసిడెంట్ కెనెడీ సూచించలేదని డాక్టర్ కింగ్ చెప్పారు.

అల్జీరియా ప్రధాని రాబట్ ఆగమనం

రాబట్, మార్చి 20—అల్జీరియా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాని బెన్‌యూసఫ్ బెన్ ఖెద్దా ట్యునిస్ నుంచి నేడిక్కడికి వచ్చారు.

మొరాక్కోలో ఆయన తన ప్రభుత్వంలోని ఇతర మంత్రులను కలుసుకుని ఫ్రాన్సులో నిర్బంధం నుంచి విడుదలైన ఉపప్రధాని మహమ్మద్ బెన్ బెల్లా, మరి ఇద్దరు అల్జీరియా నాయకులు ఇక్కడికి రాగానే వారిని అభినందిస్తారు.

కాంగోలో పరిస్థితి

ఇప్పుడు బాగా మెరుగుపడినదని శ్రీ సి. వి. నరసింహన్ విశదీకరణ

మద్రాసు, మార్చి 20—

కాంగోలో పరిస్థితి ఏడాది క్రితంకంటె ఇప్పుడు చాలా మెరుగైందని సమితి ప్రధాన కార్యదర్శి ముఖ్యసలహాదారు శ్రీ సి. వి, నరసింహన్ నేడిక్కడ ప్రకటించారు.

కాంగోలో ఎప్పుడు పూర్తి ప్రశాంత పరిస్థితి ఏర్పడి, ఆ దేశం సమైక్యంకాగలదో మనం వేచి చూడాలని ఆయన అన్నారు.

కాంగో సైన్యం దేశంలో శాంతి, భద్రతలను తానే నిర్వర్తించగలదన్న పరిస్థితి ఏర్పడేవరకు, ఆదేశంలో సమితి కార్యకలాపాలు ప్రస్తుత విధంగానే కొనసాగుతాయని శ్రీ నరసింహన్ ప్రకటించారు.

నేటి సాయంత్రం కొలంబోకు బయలుదేరేముందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ. నిధుల కొరతవల్ల కాంగోలో సమితి కార్యకలాపాలను విరమించవలసిన పరిస్థితి ఏర్పడుతుందని తాను అనుకోవడంలేదని ఉద్ఘాటించారు.

కాంగో ప్రధాని సిరిల్ అదౌలా న్యూయార్క్‌లో వున్నప్పుడు, తమ దేశం సమైక్యం అయిన తరువాత సమితి అక్కడ కొంత కాలం వుండగలదన్న ఆశాభావాన్ని వ్యక్తపరిచారని ఆయన చెప్పారు.

అల్జీరియాలో యుద్ధ విరమణ ఒప్పందం కుదిరినందుకు ఆయన తన సంతోషాన్ని ప్రకటిస్తూ, అల్జీరియా పూర్తి రిపబ్లిక్‌గా ప్రకటించబడిన తరువాత సమితిలో చేరడానికి ఎట్టి ఆటంకం వుండుందని తాను అనుకోవడం లేదని ఉద్ఘాటించారు.

అణ్వస్త్ర రాజ్యాలన్నీ అణ్వస్త్ర పాటవ పరీక్షల నిషేధం ఒప్పందం కుదుర్చుకొనాలని ఫ్రాన్సు కూడా ప్రస్తుత చర్చలలో పాల్గొంటే వుపయుక్తంగా వుండగలదని, శ్రీ నరసింహన్ అన్నారు.

దక్షిణ వియత్నాం వ్యవహారాలలో అమెరికా ప్రత్యేకించి కలగజేసుకొంటున్నదన్న రష్యా ఆరోపణలను గురించి ప్రశ్నించగా, తనకు దానితో సంబంధం లేదని చెబుతూ వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

తాను శలవుపై జులైనెలలో తిరిగి ఇండియాకురాగలనని ఆయన తెలియజేశారు.

సింహళం, మలయా, ఫిలిప్పైన్సులో పర్యటించి ఆయన న్యూయార్క్ చేరుకుంటారు.

హాంగ్‌కాంగ్ నుంచి ఎనిమిది రకాల వస్త్ర వస్త్రాల దిగుమతులను నిషేధిస్తూ అమెరికా మార్చి 18 వ తేదీన చర్య తీసుకున్నట్టు వాషింగ్టన్ వార్త.

కటాంగా వేర్పాటుకు స్వస్తి

అదౌలా-షోంబేల మూడవరోజు చర్చలు

లియోపాల్డ్‌విల్, మార్చి 20—కటాంగా వేర్పాటును అంతమొందించడానికి తీసుకొనవలసిన చర్యలను గురించి చర్చించే నిమిత్తం కాంగో ప్రధాని అదౌలా, కటాంగా ప్రెసిడెంట్ షోంబేలు నేడిక్కడ మూడవ రోజున సమావేశమయ్యారు.

ఈ చర్చలు ఫలప్రదంకాగలవని ఉభయ వర్గాలవారు గట్టిగా నిమ్ముతున్నారు.

అల్జీర్స్‌లో ప్రశాంత పరిస్థితి

అల్జీర్స్, మార్చి 20—యుద్ధవిరమణ ఒప్పందానికి నిరసనగా రహస్య సైనికోద్యం ఆదేశానుసారం సమ్మె జరిగిన తరువాత అల్జీర్స్‌లో నేడు మామూలు పరిస్థితులు నెలకొన్నాయి.

కొన్ని వారాల తరువాత నిన్న రాత్రి అల్జీర్స్ ప్రశాంతంగా వుంది.

నేడు ప్లాస్టిక్ బాంబు ప్రేలుడు ప్రమాదం ఒక్కటి మాత్రమే సంభవించింది.

అయితే నేడు అనేక దుకాణాలు మూసివేయబడ్డాయి. విమానాశ్రయం కార్మికులు నేడుకూడా సమ్మెజరిపారు,

గత 48 గంటలు సమ్మె జరిగిన హార్బర్‌లో నేడు పని యథాప్రకారం జరిగింది.

యుద్ధవిరమణ పరిస్థితిని వివరించే అనేక వేల కరపత్రాలను నేడు అల్జీర్స్ ప్రధాన వీధులలో వెదజల్లారు.

ఈ కరపత్రాలను సైన్యం లారీలు, హెలికాప్టర్లు పంచిపెట్టాయి,

జైపూరులో శ్రీమతి కెనెడీ

చంద్రమహాల్ సందర్శన

జైపూర్, మార్చి 21— శ్రీమతి జాక్విలిన్ కెనెడీ ఆమె సోదరి లాడ్జివిల్ రాకుమారి, మొన్నటిదినం వెన్నెల రాత్రిలో ఇక్కడి "చంద్రమహాల్ సందర్శించారు." ఈచంద్రమహాల్ ఏడు అంతస్తుల భవనం.

జైపూరు మహారాజ దంపతులతో కలసి శ్రీమతి కెనెడీ, ఆమె సోదరి. రాజమహాల్ నుంచి బయలుదేరి చంద్రమహాల్ చేరారు

చంద్ర మహాల్‌లోని కళాప్రదర్శనాన్ని శ్రీమతి కెనెడీ తిలకించారు. ఈ ప్రదర్శనంలోని మొగల్‌కాలంనాటి ఆభరణాలు, దుస్తులు ఆమె ఆసక్తితో తిలకించారు.

శ్రీమతి కెనెడీ ఢిల్లీ పయనం

శ్రీమతి కెనెడీ, ఉదయపూర్, జైపూరు, నగరాలను దగు కోణాలపాటు సందర్శించిన అనంతరం నిన్న సాయంత్రం ఢిల్లీ బయలుదేరి వెళ్ళారు.

శ్రీమతి కెనెడీకి విమానాశ్రయం వద్ద, రాష్ట్ర గవర్నర్, ముఖ్యమంత్రి శ్రీ సుఖాడియా. జయపూర్ మహారాజు ప్రభుతులు వీడ్కోలిచ్చారు.

శ్రీమతి కెనెడీ విమానాశ్రయానికి రాగానే, విద్యార్థినులు పాటలతో ఆహ్వానించారు.

ముఖ్యమంత్రి శ్రీసుఖాడియా, శ్రీమతి కెనెడీ ఉదయపూరు, జయపూర్ల సందర్శన జ్ఞాపకార్థంగల ఆల్బమ్‌ను ఆమె కు బహూకరించారు.

సోంపేటలో పారిశుద్ధ్య కార్మికులసమ్మె

సోంపేట, మార్చి 21—సోంపేట పంచాయతీబోర్డుకు చెందిన పాకీపనివారు ఈనెల 14 వ తేదీనుంచి సమ్మె జరుపుతున్నారు. తీరవల్ల పట్టణమంతటా పారిశుద్ధ్యం సరిగాలేకమనూచి, కలరా మున్నగు వ్యాధులు పొడసూపి, ప్రజలు చాల బాధపడుతున్నారు.

ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికలలో పార్టీ విభేదాల కారణంగా ఒక పాకీపనివానిని హతమార్చిన కారణంగా వారు ఈ సమ్మె జరుపుతున్నట్టు తెలుస్తున్నది.

ఈ సమ్మె నివారణకు స్థానిక పంచాయతీ బోర్డు అధికారులు, జిల్లా అధికారులు ఏవిధమైన చర్యలు తీసికొనకుండా మౌనంగా వున్నారు, దానిపై వెంటనే చర్యతీసికొని, సమ్మెవిరమింప చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి పంపబడింది.



Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd., Vijayawada-2.
Editor: Narla Venkateswara Rao.